CELEBRATING 11TH YEAR ANNIVERSARY

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    PEN POWER TELUGU DAILY    ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1  సంచిక : 03  పేజీలు : 8  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా  శుక్రవారం 14 నవంబర్ 2025  వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 03 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST FRI 14 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# విశాఖపట్నంలో ఐటీ కంపెనీల పండుగ!

## ఒకేరోజు 5 కంపెనీలకు లోకేశ్ భూమిపూజ








- ఉత్సాహంగా పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, ప్రజలు
- సైల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్, టెక్ తమ్మిన తదితర కంపెనీలకు లోకేశ్ భూమిపూజ
- వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు మంత్రి భూమిపూజ

**పెన్ పవర్ డెస్క్:**విశాఖపట్నంలో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ఒకరోజు ముందే ఐటీ పండుగ వచ్చింది. సమ్మిట్‌లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన మంత్రి నారా లోకేశ్ గురువారం ఒకేరోజు 5 కంపెనీలకు భూమిపూజ చేశారు. పారిశ్రామికవేత్తలతో పాటు విశాఖ ప్రజలు ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.3,800 కోట్లతో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 30 వేలమందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. కంపెనీల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు నగర ప్రజలు నీరాజనాలు పట్టారు.

భారత్‌లో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖ గూగుల్ ఏఐ హబ్ ప్రకటన తర్వాత నగరానికి ఐటీ కంపెనీలు క్యూ కట్టాయి. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోగా, తాజాగా సైల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్, టెక్ తమ్మిన, ఫీనోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కె.రహేజా, కపిల్ గ్రూప్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు మంత్రి లోకేశ్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, లోకం మాధవి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సెయిల్స్ సాఫ్ట్‌వేర్‌కు శంకుస్థాపన

విశాఖ మధురవాడ ఐటీ హిల్ నెం.2లో సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ అడ్వాన్స్ సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ అండ్ ఏఐ ఎక్సలెన్స్ సెంటర్‌కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. మంత్రితోపాటు ఈ కార్యక్రమానికి హాజరైన సంస్థ ఎండీ %ఆ% సీఈవో కిరణ్ మాట్లాడుతూ... విశాఖలో రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే

వివరాలు 2లో..



## ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తాం



### భారత్-ఈయూ సదస్సులో సీఎం చంద్రబాబు

- ముగిసిన భారత్-ఈయూ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశం
- గ్రీన్ ఎనర్జీయే ప్రపంచానికి కీలకమని స్పష్టం చేసిన చంద్రబాబు
- ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటన
- నౌకా నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని విదేశీ సంస్థలకు పిలుపు
- ప్రకృతి విపత్తులకు భూతాపమే కారణమని ఆందోళన

**పెన్ పవర్ డెస్క్:**భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశం ముగిసింది. ఈ సదస్సులో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు.. సుస్థిరాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ ప్రాముఖ్యతపై కీలక ప్రసంగం చేశారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌ను 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ'గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ, అర్మేనియా తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివరాలు 2లో..

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ




- పరిశ్రమల స్థాపనకు ముఖ్యమంత్రి సమక్షంలో తైవాన్ ప్రతినిధి బృందంతో ఎంవోయూలు
- పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు తైవాన్ కంపెనీల ఆసక్తి
- రాష్ట్ర ప్రభుత్వ సహకారం బాగుందని కొనియాడిన తైవాన్ ప్రతినిధి బృందం

వివరాలు 2లో..

## ఏపీకి మరోసారి భారీ వర్ష సూచన

- బంగాళాఖాతంలో నవంబర్ 17న కొత్త అల్పపీడనం
- 17, 18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**ఇప్పటికే ఏపీలో చలి తీవ్రతతో ప్రజలు ఇబ్బంది పడు తుండగా, వాతావరణ శాఖ మరో కీలక హెచ్చరిక జారీ చేసింది.

వివరాలు 2లో..

## అది మా చట్టబద్ధమైన భూమి: పవన్‌పై మిథున్ రెడ్డి ఫైర్

- పెద్దిరెడ్డి భూకబ్జాలపై పవన్ కల్యాణ్ ఏరియల్ సర్వే
- విచారణ జరపాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి
- పవన్ ఆరోపణలపై స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి
- చేసిన ఆరోపణలు నిరూపించాలని డిమాండ్
- ఆ భూమి 2000లోనే చట్టబద్ధంగా కొన్నామన్న మిథున్ రెడ్డి



**పెన్ పవర్ డెస్క్:**డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చా రు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూములు ఆక్రమించారంటూ పవన్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ ఆరోపణలను నిరూపించాలని

వివరాలు 2లో..

## మీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అద్భుతం
## చంద్రబాబుపై జగన్ సెటైర్లు

- ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ తీవ్ర విమర్శలు
- 'క్రెడిట్ చోరీ స్కీం' అద్భుతంగా నడుస్తోందంటూ ఎద్దేవా
- వైసీపీ హయాంలో కట్టిన ఇళ్ల క్రెడిట్ కొట్టేస్తున్నారని విమర్శ
- ఇతరుల కష్టాన్ని చెప్పుకునేవాడు నాటకాల రాయుడు అని వ్యాఖ్య
- పచ్చి అబద్ధాలతో ప్రచారం చేసుకోవడం హేయమన్న జగన్



వివరాలు 2లో..



## పగలు డాక్టర్.. సాయంత్రం 4 తర్వాత టెర్రరిస్ట్..
## షహీన్ సయీద్ డబుల్ లైఫ్ బట్టబయలు

- ఢిల్లీ ఎర్రకోట పేలుడు కేసులో ప్రధాన నిందితురాలు డాక్టర్ షహీన్
- జైషే మహమ్మద్ మహిళా విభాగానికి హెడ్‌గా నిఘా వర్గాల గుర్తింపు
- సాయంత్రం 4 తర్వాతే తన 'అసలు పని' మొదలయ్యేదని వెల్లడి
- దేశవ్యాప్తంగా 32 కార్లతో వరుస పేలుళ్లకు భారీ కుట్ర
- టెర్రర్ కుట్రకు ఉపయోగించిన కార్లు షహీన్ పేరుతో ఉన్నట్టు నిర్ధారణ

వివరాలు 2లో..

## కొండా సురేఖపై కేసు ఉపసంహరించుకున్న నాగార్జున



- మంత్రిపై పరువు నష్టం కేసును ఉపసంహరించుకున్నట్లు నాగార్జున వెల్లడి
- గతంలో నాగార్జున కుటుంబంపై కొండా సురేఖ వ్యాఖ్యలు
- మొన్న క్షమాపణలు చెబుతూ 'ఎక్స్' వేదికగా ట్వీట్

వివరాలు 2లో..

## విద్యా వ్యవస్థ చచ్చిపోయింది.. విద్యార్థులారా మేల్కొనండి

- ఏఐ విప్లవం ముందు విద్య చచ్చిపోయిందన్న రామ్ గోపాల్ వర్మ
- జ్ఞాపకశక్తి ఆధారిత విద్యా విధానం ఇక పనికిరాదని వ్యాఖ్య
- ఏఐ టూల్స్ వాడటం నేర్పడమే నిజమైన విద్య అని సూచన



**పెన్ పవర్ డెస్క్:**వివాదాలకు, సంచలన వ్యాఖ్యలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో స్పందించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) విప్లవం నేపథ్యంలో ప్రస్తుత విద్యా వ్యవస్థ పూర్తిగా "చనిపోయింది" అంటూ ఆయన చేసిన ఓ ట్వీట్ సోషల్ మీడియాలో

వివరాలు 2లో..

## విదేశాల్లోని భారత ఉద్యోగులకు గుడ్ న్యూస్...
## కేంద్రం సరికొత్త బిల్లు!

- విదేశీ ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త మొబిలిటీ బిల్లు-2025
- భారత నిపుణులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడం లక్ష్యం
- 1983 నాటి వలస చట్టం స్థానంలో నూతన నిబంధనలు
- వలసల స్థానంలో నైపుణ్యాలను ఎగుమతి చేసే సరికొత్త వ్యూహం
- అభివృద్ధి చెందిన దేశాల్లో కార్మికుల కొరతే భారత్‌కు అవకాశం
- యూకేతో ఒప్పందం వల్ల భారత కంపెనీలకు ఏటా రూ.4,000 కోట్ల ఆదా

**పెన్ పవర్ డెస్క్:**విదేశాల్లో పనిచేస్తున్న, పనిచేయడానికి వెళుతున్న భారతీయ కార్మిక ులు, నిపుణుల ప్రయోజనాలను కాపాడేం దుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వలసలపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో, భారత ఉద్యోగులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడంతో పాటు, వారు తమ ఉద్యోగ కాలం ముగిశాక



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పెద్దిరెడ్డి కుటుంబం చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు

వైసీపీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కీలకనేత. ఆయన ఒక రకంగా చెప్పాలంటే.. జగన్ తర్వాత ఆయన మాత్రమేనని అంటారంతా. ఎందుకంటే జగన్ కు అంతా తానే అయి వ్యవహరించేది కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమేనంటారు. అలాంటి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఎప్పటి నుంచో కూటమి ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచింది. ఇదివరకే ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ని స్పెషల్ ఇన్విస్టిగేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. దాదాపు 70 రోజులకు పైగానే రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిధున్ రెడ్డి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో అందరూ ఓడిపోయినా పెద్దిరెడ్డి కుటుంబం మాత్రం ఓటమి చవి చూడలేదు.

**ముగ్గురు గెలిచినా...**

పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాధ్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యుడిగా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి విజయం సాధించారు. చిత్తూరు జిల్లాలో ఈ రెండు మాత్రమే వైసీపీకి దక్కాయి. పార్లమెంటు నియోజకవర్గాల్లో వచ్చిన మూడు స్థానాల్లో ఒకటి కడప, మరొకటి అరకు, ఇంకొకటి రాజంపేట మాత్రమే. అలా పాతుకుపోయిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా వేళ్లతో సహా పెకిలించడానికి ప్రయత్నాలు మొదలయినట్లే కనిపిస్తుంది. అటవీ భూముల ఆక్రమణ విషయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డంగా బుక్కయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటవీ భూముల చట్ట ప్రకారం శిక్షలు కూడా భారీగా పడే అవకాశాలుంటాయని న్యాయనిపుణులు చెబుతున్నారు.

**వైరం ఈ నాటిది కాదు...**

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మధ్య వైరం ఈ నాటిది కాదు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఇద్దరూ చదువుకునే రోజులలో తలెత్తిన వైరం నేటికీ రాజకీయంగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూముల విషయంలో చిక్కుల్లో పడినట్లేనని అంటున్నారు. అందులోనూ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖను పర్యవేక్షిస్తున్న పవన్ కల్యాణ్ బయటపెట్టిన వీడియోతో దాదాపు 74 ఎకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఆక్రమించుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆయనకు కష్టాలు మొదలయినట్లేనని అంటున్నారు. అందుకోసమే పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్లినట్లు కూడా వైసీపీ నేతలు అనుమానిస్తున్నారు. హెలికాప్టర్ లో వెళ్లి వీడియోను చిత్రీకరించడం కూడా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇరికించడానికేనన్న అభిప్రాయం వైసీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే పెద్దాయన పెద్దిరెడ్డి రెడీ అవ్వాల్సిందే అన్నట్లుంది పరిస్థితి.

## విదేశాల్లోని భారత ఉద్యోగులకు గుడ్ న్యూస్...

# కేంద్రం సరికొత్త బిల్లు!

- మొదటి పేజి తరువాయి

తిరిగి స్వదేశానికి వచ్చేలా ప్రోత్సహించేందుకు 'ఓవర్సీస్ మొబిలిటీ (ఫెసిలిటేషన్ అండ్ వెల్ఫేర్) బిల్లు, 2025'ను ప్రతిపాదించింది.ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది డిప్లొమాట్' కథనం ప్రకారం, ఈ కొత్త బిల్లు కేవలం వలస విధానంలో మార్పు కాదు, ఆర్థిక దౌత్యంలో కార్మిక శక్తిని ఒక మూలస్తంభంగా మార్చే ప్రయత్నం. ఇప్పటివరకు అమల్లో ఉన్న 1983 నాటి పాత వలస చట్టం స్థానంలో ఈ కొత్త బిల్లు సమగ్రమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురానుంది. ఇది కేవలం విదేశీ ఉపాధిని సులభతరం చేయడమే కాకుండా, ఉద్యోగులు సురక్షితంగా తిరిగి రావడం, స్వదేశంలో వారి పునరేకీకరణకు కూడా భరోసా ఇస్తుంది.ఈ బిల్లు ద్వారా భారత ప్రభుత్వం తన కార్మికుల వలసలను కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితం చేయకుండా, వారి ఉద్యోగ నిబంధనలపై ఇతర దేశాలతో చురుగ్గా చర్చలు జరుపుతోంది. 2014 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూరప్, ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని దాదాపు 20 దేశాలతో కార్మిక మొబిలిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. "అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గి కార్మికుల కొరత ఏర్పడుతుంటే, భారత్ వంటి దేశాల్లో స్థిరమైన జనాభా ఉన్నా ఉద్యోగాల కొరత ఉంది. ఈ సమస్యకు శాశ్వత వలసలు పరిష్కారం కాదు, ఎందుకంటే దీనివల్ల రాజకీయ వ్యతిరేకత వస్తోంది. అందుకే, భారత్ తన నైపుణ్యాలను ఒక నిర్ణీత కాలపరిమితితో ఎగుమతి చేసే మార్గాన్ని ఎంచుకుంది" అని ఆ కథనం విశ్లేషించింది.భారత్ అతిపెద్ద ఆస్తి 25 ఏళ్లలోపు వయసున్న 60 కోట్లకు పైగా యువత కాగా, అభివృద్ధి చెందిన దేశాలు తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యయనం ప్రకారం, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 4.5 నుంచి 5 కోట్ల మంది కార్మికుల కొరత ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో జర్మనీ, జపాన్ వంటి దేశాలు భారతీయ కార్మికుల కోసం చురుగ్గా ప్రయత్నిస్తున్నాయి.ఇప్పటికే భారత్ కుదుర్చుకుంటున్న ఒప్పందాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉదాహరణకు, భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (%జజుూా%) ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు అక్కడి సామాజిక భద్రతా చందాలు చెల్లించకుండా మూడేళ్లపాటు మినహాయింపు పొందారు. దీనివల్ల భారత కంపెనీలకు ఏటా సుమారు రూ.4,000 కోట్ల ఆదా అవుతుందని అంచనా.ప్రతిపాదిత కొత్త బిల్లు వివిధ దేశాల ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంచడానికి, అంతర్జాతీయ వలస ఒప్పందాలను పర్యవేక్షించడానికి, డేటా ఆధారిత విధానాలను రూపొందించడానికి దోహదపడుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా, విదేశాలకు వెళ్లే భారతీయుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కులను కాపాడటానికి అవసరమైన వ్యవస్థలను ఇది బలోపేతం చేయనుంది.

# పగలు డాక్టర్.. సాయంత్రం 4 తర్వాత టెర్రరిస్ట్..

ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ షహీన్ సయీద్ పగలు వైద్యురాలిగా పనిచేస్తూ, సాయంత్రం కాగానే ఉగ్రవాద కార్యకలాపాల్లో మునిగి తేలేదని విచారణలో తేలింది. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు ఫరీదాబాద్‌లోని అల్-ఫలా మెడికల్ సైన్సెస్ కాలేజీలో తన ఉద్యోగం ముగిశాకే, తన 'అసలు పని' మొదలవుతుందని షహీన్ తరచూ చెప్పేదని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.ఎన్డీటీవీ కథనం ప్రకారం, షహీన్ ప్రవర్తన చాలా విచిత్రంగా ఉండేదని ఆమె సహోద్యోగి ఒకరు తెలిపారు. ఆమె ఎప్పుడూ తన వెంట ప్రార్థనలకు ఉపయోగించే తస్బీహ్ (జపమాల), హదీస్ పుస్తకాన్ని ఉంచుకునేదని, సంస్థ నిబంధనలను పాటించకుండా ఎవరికీ చెప్పకుండానే తరచూ బయటకు వెళ్లిపోయేదని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సదరు విద్యాసంస్థ, షహీన్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించింది.పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (%జీవవీ%) ఉగ్రవాద సంస్థ మహిళా విభాగానికి షహీన్ హెడ్‌గా పనిచేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. లక్నో నివాసి అయిన షహీన్‌ను సోమవారం అరెస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే, ఉమర్ మహమ్మద్ అనే మరో ఉగ్రవాది ఎర్రకోట వద్ద పేలుడు పదార్థాలతో నింపిన హ్యుందాయ్ ఐ20 కారుతో ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో షహీన్ కాన్పూర్ మెడికల్ కాలేజీ, కన్నౌజ్ మెడికల్ కాలేజీలలో ఫార్మాకాలజీ విభాగాధిపతిగా కూడా పనిచేసింది.ఈ కేసులో షహీన్‌కు ముందే డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ ఆదిల్ అహ్మద్‌లను అరెస్ట్ చేయడం 'వైట్ కాలర్ టెర్రరిజం' కోణాన్ని తెరపైకి తెచ్చింది. ఉగ్రకుట్రకు ఉపయోగించిన రెండు కార్లను షహీన్ పేరు మీదే గుర్తించారు. అసాల్ట్ రైఫిల్, బుల్లెట్లు లభించిన మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారును షకీల్ వాడగా, బాంబు డెలివరీ కోసం సిద్ధం చేసిన మారుతీ బ్రెజాను షహీన్ స్వయంగా నడిపేదని అధికారులు తెలిపారు.దేశ రాజధాని సహా పలు ప్రాంతాల్లో వరుస పేలుళ్లకు ఈ ముఠా భారీ ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఏకంగా 32 కార్లను సిద్ధం చేసినట్లు సమాచారం. బుధవారం మరో ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాల రవాణాకు దీన్ని వాడినట్లు ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలింది. ఈ కుట్ర వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు సంస్థలు విచారణను ముమ్మరం చేశాయి.

# విశాఖపట్నంలో ఐటీ కంపెనీల పండుగ!

- మొదటి పేజి తరువాయి

ఏఐ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా 430 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. డిజిటల్ ఆంధ్రప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌పై దృష్టి సారించనున్నట్లు ఆయన చెప్పారు.

**ఐస్పేస్ సాఫ్ట్‌వేర్‌కు భూమిపూజ**

విశాఖ మధురవాడ ఐటీ హిల్ నెం.2లో ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ యూనిట్‌కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు హాజరైన సంస్థ సీఈఓ రమేశ్ మాట్లాడుతూ... విశాఖలో తమ సంస్థ మూడు దశల్లో రూ.119.18 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా, 2 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఐటీఈ సేవల డెలివరీ కార్యకలాపాలను తాము విశాఖ యూనిట్ ద్వారా చేపడతామని తెలిపారు.

**ఫీనోమ్ డెవలప్ మెంట్ సెంటర్‌కు భూమిపూజ**

విశాఖ మధురవాడ ఐటీ హిల్ నెం.2లో ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. లోకేశ్‌తోపాటు కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ కో-ఫౌండర్ హరి బైరెడ్డి మాట్లాడుతూ... విశాఖ యూనిట్‌పై రెండు దశల్లో రూ.207.5 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా, 2,500 మంది ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. తాము అడ్వాన్స్ ప్రొడక్ట్ డెవలప్ మెంట్, ఏఐ రీసెర్చి, కస్టమర్ డెలివరీ ఎక్సలెన్స్‌పై దృష్టిసారిస్తామని తెలిపారు.

**రహేజా మిక్స్‌డ్ డెవలప్‌మెంట్ స్పేస్‌కు శంకుస్థాపన**

విశాఖ మధురవాడ ఐటీ హిల్ నెం.3లో రహేజా సంస్థ ఐటీ స్పేస్/కమర్షియల్ స్పేస్ మిక్స్‌డ్ డెవలప్‌మెంట్ స్పేస్‌కు మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. మంత్రి వెంట కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రెసిడెంట్ రవి సి.రహేజా మాట్లాడుతూ... విశాఖలో రూ.2,172 కోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా, 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఐటీ కంపెనీలు, డాటా సెంటర్లు, జీసీసీ కంపెనీలకు అవసరమైన ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ లగ్జరీ ఫ్లాట్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

**వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు భూమిపూజ**

విశాఖ యండాడలో కపిల్ గ్రూప్ అనుబంధ సంస్థ బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ఆధ్వర్యాన వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. మంత్రి లోకేశ్ వెంట కార్యక్రమంలో పాల్గొన్న కపిల్ గ్రూప్ చైర్మన్ వామనరావు మాట్లాడుతూ... విశాఖలో రెండు విడతలుగా రూ.1,250 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా, 15 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఐటీ/ఐటీఈఎస్ ఆఫీసు స్పేస్, కమర్షియల్ స్పేస్ మిక్స్‌డ్ డెవలప్‌మెంట్ తోపాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పెట్టుబడుల ఆకర్షణ, హైవ్యాల్యూ జాబ్ క్రియేషన్ లక్ష్యాలుగా వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ

తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని తైవాన్ ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి తెలిపారు.పెట్టుబడుల సదస్సులో భాగంగా భారత్‌లో తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి మునిన్ చెన్ నేతృతంలోని తైవాన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి తైవాన్ బృందానికి వివరించారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో - తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ముఖ్యమంత్రికి తెలిపింది.పాద రక్షల తయారీ కంపెనీ పౌ చెన్ గ్రూప్ ఫుట్ వేర్ యూనిట్ ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సార్లను ఉత్పత్తి చేసేందుకు తైవాన్‌కు చెందిన క్రియేటివ్ సెన్సార్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించేందుకు సహకరించాలని కోరింది. ఓర్వకల్లు సమీపంలోనే ఇ-జౌల్ ఇండియా జాయింట్ వెంచర్ సంస్థ అడ్వాన్స్డ్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు కూడా ముందుకు వచ్చింది. 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ ప్రతిపాదించింది.వీటికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తైవాన్ కంపెనీల ప్రతినిధులు- ఈడీబీ ఒప్పందాలు చేసుకున్నారు. తైవాన్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్కుకు భూములు కేటాయిస్తామని సీఎం స్పష్టం చేశారు. పారిశ్రామిక పార్కులకు వివిధ రహదారులను అనుసంధానిస్తామని పేర్కొన్నారు. కర్ణాటక, ఏపీ, తమిళనాడు రీజియన్లను కలుపుతూ ఈ రహదారి మార్గాలు ఉన్నాయని తైవాన్ ప్రతినిధులకు వివరించారు.ఇండియా సెమీ కండక్టర్ మిషన్ పాలసీలో భాగంగా ప్రోత్సాహకాలకు సంబంధించిన నిర్ణయాలు త్వరలోనే కేంద్రం విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. తైవాన్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరుల్ని తయారు చేసేందుకు సిద్ధమని సీఎం వెల్లడించారు. తైవాన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను కూడా ఏపీలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఏపీలో పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వ సహకారం బాగుందని తైవాన్ బృందం కొనియాడింది.

**ఇటాలియన్ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుపై చర్చ**

ఆంధ్రప్రదేశ్?లో ఇటాలియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని కోరారు. విశాఖపట్నంలోని %జ××% భాగస్వామ్య సదస్సు సందర్భంగా వివిధ దేశాల రాయబారులతో సీఎం చంద్రబాబు భేటీ అవుతున్నారు. ఈ భేటీల్లో భాగంగా గురువారం భారతదేశంలోని ఇటలీ రాయబారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని ముఖ్యమంత్రి బార్టోలీకి వివరించారు.

కీలక రంగాలైన ఆటోమోటివ్, ఆటో విడిభాగాలు, యంత్రాల తయారీ, ఇంధన, ఫ్యాషన్, ఆహార శుద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై ముఖ్యమంత్రి-ఇటలీ రాయబారి మధ్య చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ యంత్రాలు, పునరుత్పాదక విద్యుత్ రంగం, నౌకానిర్మాణ రంగాలలో భాగస్వాములు కావాలని ఇటాలియన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఏపీ-ఇటలీ మధ్య దీర్ఘకాలిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఇటాలియన్ ఇండస్ట్రియల్ క్లస్టర్ ను ఏర్పాటు చేసే అంశంపై సీఎం చంద్రబాబు-ఇటలీ రాయబారి బార్టోలీ మధ్య చర్చలు జరిగాయి.

## మీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అద్భుతం

# చంద్రబాబుపై జగన్ సెటైర్లు

ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య 'క్రెడిట్' వార్ తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు విజయవంతంగా "క్రెడిట్ చోరీ స్కీం" నడుపుతున్నారంటూ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో ప్రభుత్వం వాస్తవాలను పక్కనపెట్టి, తమ ఘనతగా ప్రచారం చేసుకుంటోందని జగన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "చంద్రబాబు గారూ.. మీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుంది. ఇతరుల కష్టాన్ని తన గొప్పతనంగా చెప్పుకునేవాడు నాయకుడు కాదు. నాటకాల రాయుడు అంటారు" అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, నిర్మాణం ప్రారంభించిన ఇళ్లనే ఇప్పుడు తామే కట్టేశామంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని జగన్ విమర్శించారు. "గత 18 నెలల్లో పేదలకు ఒక్క గజం స్థలం సేకరించలేదు, ఒక్క సెంటు స్థలం ఇవ్వలేదు, ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. గత ప్రభుత్వంలో ఇచ్చిన స్థలాల్లో, మేం శాంక్షన్ చేయించిన ఇళ్లనే పట్టుకుని 'అన్నీ మేమే కట్టేశాం' అని పచ్చి అబద్ధాలు చెప్తున్నారు. ఈ క్రెడిట్ చోరీ హేయంగా ఉంది" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రారంభించామని చెబుతున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటి పట్టా కూడా ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వలేదని జగన్ స్పష్టం చేశారు. "ఆ ఇళ్లలో 1,40,010 ఇళ్లు మా హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నాయి. మరో 87,380 ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు, 66,845 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నవి కూడా మా హయాంలో మొదలైనవే. ఇవి కాకుండా అక్టోబర్ 12, 2023న ఒకేరోజు 7,43,396 ఇళ్ల గృహప్రవేశాలతో మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది" అని జగన్ గుర్తుచేశారు.తమ హయాంలో 31.19 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి, 21.75 లక్షల ఇళ్లు శాంక్షన్ చేశామని జగన్ తెలిపారు. మిగిలిన 10 లక్షల ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాల్సింది పోయి, ఆ ఖాళీ స్థలాలను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "ఒకరి కష్టాన్ని, ఒకరి ఐడియాను మీదిగా చెప్పుకోవడంలో, చివరికి పేదల ఇళ్ల స్థలాలను లాక్కోవడంలో మీకు మీరే సాటి" అంటూ విమర్శించారు. తన పోస్టుకు చ%జతీవఎ్‌జష్త్రశీతీదీుఎబ% అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించి చంద్రబాబుపై తన పోరాటాన్ని సోషల్ మీడియాలో ఉద్ధృతం చేశారు.

# ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తాం

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా భూతాపం పెరిగిపోవడం వల్ల ప్రకృతి విపత్తులు విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "క్లౌడ్ బరస్ట్ వంటి ఘటనలతో నగరాలు నీట మునుగుతున్నాయి. ఒకేచోట 40 సెంటీమీటర్ల వర్షపాతం కురవడం వంటి తీవ్ర పరిణామాలు గ్లోబల్ వార్మింగ్ వల్లే సంభవిస్తున్నాయి. ఈ ఉత్పాతాలను ఎదుర్కోవాలంటే మనమంతా కలిసి గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేయాలి" అని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే సౌర, పవన, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో చురుగ్గా పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి రానున్న డేటా సెంటర్లకు కూడా గ్రీన్ ఎనర్జీనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భారత్, ఈయూ మరింత సమర్థంగా కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ సదస్సులో పెట్టుబడులను ఆకర్షించే దిశగా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం భారత్ నౌకా నిర్మాణ రంగంలో వెనుకబడి ఉంది. ఈ రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ముందుకు రావాలి" అని విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించారు.గ్రీన్ ఎనర్జీతో పాటు ఆర్గానిక్ ఆహార ఉత్పత్తుల రంగంలోనూ ఏపీ కీలకంగా పనిచేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో పండించిన 'అరకు కాఫీ' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. మానవాళి సంక్షేమం కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

# కొండా సురేఖపై కేసు ఉపసంహరించుకున్న నాగార్జున

తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై టాలీవుడ్ ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున క్రిమినల్ కేసును ఉపసంహరించుకున్నారు. మంత్రి తనకు, తన కుటుంబానికి క్షమాపణలు చెప్పినందున, ఆమెపై దాఖలు చేసిన పరువునష్టం దావాను ఉపసంహరించుకుంటున్నట్లు నాగార్జున తెలిపారు. గతంలో నాగార్జున కుటుంబంపై తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని మంత్రి కొండా సురేఖ నిన్న సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. నాగార్జునను, ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలని కానీ, వారి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించాలని కానీ తన ఉద్దేశం కాదని ఆమె పేర్కొన్నారు. నాగార్జున కుటుంబంపై తాను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు జరిగి ఉంటే అందుకు చింతిస్తున్నానని, తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని ఆమె తెలిపారు.

## అది మా చట్టబద్ధమైన భూమి:

# పవన్‌పై మిథున్ రెడ్డి ఫైర్

- మొదటి పేజి తరువాయి

సవాల్ విసిరారు.మాజీ మంత్రి పెద్దిరెడ్డి తూర్పు కనుమల పరిధిలోని మంగళం పేటలో అటవీ భూములను ఆక్రమించారని ఆరోపిస్తూ డిప్యూటీ సీఎం పవన్ హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ భూ కబ్జాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమగ్ర విచారణ జరిపించాలని కూడా ఆయన కోరారు.

పవన్ కల్యాణ్ ఆరోపణలపై పెద్దిరెడ్డి కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "పవన్ కల్యాణ్ గారూ, గతంలో ఎర్రచందనం విషయంలో మీరు చేసిన వ్యాఖ్యలు గుర్తున్నాయా? ఇప్పుడు హెలికాప్టర్‌లో నుంచి మీరు చూపించిన భూమి మా చట్టబద్ధమైన సొత్తు. ఆ భూమిని మేము 2000 సంవత్సరంలోనే కొనుగోలు చేశాం" అని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. తమపై చేసిన ఆరోపణలు నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏపీకి మరోసారి భారీ వర్ష సూచన

- మొదటి పేజి తరువాయి

బంగాళాఖా తంలో ఏర్పడనున్న అల్ప పీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. నవంబర్ 17, 18 తేదీల్లో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వాతావరణ శాఖ అధికారుల అంచనా ప్రకారం, నవంబర్ 17న ఆగ్నేయ బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది వేగంగా బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని, దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపారు. ముఖ్యంగా ఉత్తర ఆంధ్ర, కోస్తా జిల్లాలు, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వర్షాలతో పాటు తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని అధికారులు పేర్కొన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## విద్యా వ్యవస్థ చచ్చిపోయింది.. విద్యార్థులారా మేల్కొనండి

- మొదటి పేజి తరువాయి

ప్రకంపనలు సృష్టిస్తోంది. "విద్యార్థులారా మేల్కొండి.. ఏఐ విప్లవం ముందు విద్య చచ్చిపోయింది" అని ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి.ప్రస్తుత విద్యా విధానం పూర్తిగా కాలం చెల్లినదని, దానిపై పునరాలోచించాల్సిన సమయం ఆసన్నమైందని వర్మ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కేవలం జ్ఞాపకశక్తిపై ఆధారపడిన చదువులకు ఇక విలువ ఉండదని స్పష్టం చేశారు. "ఒకే ఒక్క క్లిక్‌తో లక్షల కేసులను విశ్లేషించి ఏఐ చికిత్స సూచించగలిగినప్పుడు, విద్యార్థులు పదేళ్ల పాటు విషయాలను గుర్తుపెట్టుకోవడానికి ఎందుకు సమయం వృథా చేయాలి?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. భవిష్యత్ తరాల విద్య పుస్తకాల్లోని సమాచారాన్ని బట్టీ పట్టడం కాదని, ఏఐ పరికరాలను సృజనాత్మకంగా ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకోవడంలోనే ఉందని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయాలు, విద్యా బోర్డులు మారే వరకు ఏఐ వేచి చూడదని, మార్పును అందిపుచ్చుకోలేని వ్యవస్థలను అది చెరిపేస్తుందని ఆయన హెచ్చరించారు. పాఠశాలలు సైతం తమ బోధన పద్ధతులను మార్చుకుని, పరీక్షల్లో ఏఐని ఒక సహాయక సాధనంగా అనుమతించాలని సూచించడం గమనార్హం."ఏఐ మిమ్మల్ని చంపదు, కేవలం పట్టించుకోదు" అని వ్యాఖ్యానించిన వర్మ, "ఏఐని వాడలేని వారు భవిష్యత్తులో ఏఐ చేతనే వాడబడతారు" అంటూ తీవ్రమైన హెచ్చరిక చేశారు. ప్రస్తుతం ఆర్జీవీ చేసిన ఈ వ్యాఖ్యలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య విస్తృత చర్చకు దారి తీశాయి. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులు రావాలనే దానిపై కొత్త ఆలోచనలకు ఈ ట్వీట్ తెరలేపింది.

# పథకాలు పొందేందుకు ఈ- కేవైసీ తప్పనిసరి



**గోకవరం, పెన్ పవర్, నవంబరు 13 :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ సెంటరుకు వెళ్లి ఆధార్ అప్డేట్ చేయించుకున్న తర్వాత సచివాలయం సిబ్బందితో ఈ కేవైసీ చేయించుకోవాలని ఎమ్పీడీఓ గోవింద్ తెలిపారు. ఈ విధంగా ఆధార్ అప్డేట్,ఈ- కేవైసీ చేయించుకున్న వారికి ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఎటువంటి ఆటంకం ఉండదని ఎమ్పీడీఓ అన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

## గోదావరి పుష్కరాలు విజయవంతానికి
# శాఖల మధ్య సమన్వయం అవసరం

### గోదావరి పుష్కరాలు - 2027 పై శాఖల వారి కార్యాచరణ పై కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 13:** గోదావరి పుష్కరాలు - 2027ను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ శాఖల విధులు, బాధ్యతలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై శాఖల వారీగా నిర్దిష్టమైన అంచనాలు రూపొందించి, ముఖ్యమంత్రి సమక్షంలో జిల్లా యంత్రాంగం ప్రదర్శించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలు - 2027 నేపథ్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సమక్షంలో గోదావరి పుష్కరాలు 2027 కార్యాచరణ ప్రణాళిక అందచేసే క్రమంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, ఇంచార్జి మంత్రి ఆధ్వర్యంలో సూచనలు, సలహాలను, అధికారుల ప్రతిపాదనలతో సమన్వయం చేసుకోవలన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో గత పుష్కరాల సమయంలో వచ్చిన భారీ జనసమ్మర్ధం, రవాణా సౌకర్యాలు, భద్రత, శానిటేషన్, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై విభాగాల వారీగా చర్చించారు. రానున్న గోదావరి పుష్కరాలు 2027 సమర్ధవంతం గా నిర్వహించే క్రమంలో శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌పోర్ట్, ఆర్ టి సి తదితర శాఖలు ప్రాథమిక కార్యాచరణ, బాధ్యతలు, అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలను సమగ్రంగా వివరించాయి. కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొంటూ, రానున్న సమావేశాల్లో ఇరిగేషన్, దేవాదాయ, రైల్వే, రవాణా, విద్యుత్, మునిసిపల్ శాఖలు 2003, 2015 పుష్కరాల అనుభవాలను ఆధారంగా విభాగాల డేటా, ఎదుర్కొన్న సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికలు సమర్పించాలన్నారు. 2027 పుష్కరాల నిర్వహణలో స్మార్ట్ మానిటరింగ్, ఐ సి సి సి ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, ఏ ఐ టెక్నాలజీ, డిజిటల్ ఇన్వెంటరీ సిస్టమ్ వంటి ఆధునిక పద్ధతులు కీలకమని పేర్కొన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం ఇరు ప్రాంతాల్లో పుష్కర స్నానాలు ఆచరించే భక్తుల సంఖ్య ముందస్తు అంచనా వెయలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్, క్రౌడ్ నిర్వహణ లో రవాణా, ఇతర వ్యవస్థలు పోలీసు యంత్రాంగం తో కలిసి పని చేయడం ముఖ్యమన్నారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, జన సమూహాల పర్యవేక్షణ అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధాన ఘాట్ల వద్ద సీసీటీవీ కెమెరాలు, ఏ ఐ ఆధారిత డెన్సిటీ ట్రాకింగ్ సిస్టమ్, డ్రోన్ పర్యవేక్షణ, స్మార్ట్ పేట్రోలింగ్ పాయింట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాల సమయంలో పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్ శాఖలు సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ తో సమగ్ర మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

ఈ సంద ర్భంగా కె పి ఎం జి కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులు ప్రకాశ్ శ్రీవాత్సవ్, ప్రశాంత్ లు మహా కుంభమేళా - 2025(ప్రయాగ్‌రాజ్)లో అమలు చేసిన స్మార్ట్ క్రౌడ్ మేనేజ్‌మెంట్, వాహన చలనం, పార్కింగ్, శానిటేషన్, డిజిటల్ కమ్యూనికేషన్, ఐ సి సి సి ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల అమలు విధానాలను వివరించారు. గోదావరి పుష్కరాల సందర్భంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ లేఅవుట్, మోడల్ ప్రణాళిక అందించనున్నట్లు తెలియ చేశారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ మురళీ కృష్ణ, ఆర్డీవోలు రాణి సుస్మిత, కృష్ణ నాయక్, డీఎస్పీ దేవకుమార్, రైల్వే, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, మునిసిపల్, ఆర్టిసి, ఆర్ ఎమ్ సి, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓ బి సి సర్టిఫికెట్ల కోసం కొత్తూరులో
# విద్యార్థుల అగచాట్లు



**ఏలూరు నవంబర్ 13 పెన్ పవర్:** దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఓ బి సి సర్టిఫికెట్ల కోసం విఆర్ఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు గ్రామంలోని విఆర్వో కార్యాలయాన్ని స్థానిక ఓ హెచ్ ఆర్ ప్రాంతం నుండి ఖాళీ అయిన పాత సచివాలయంలోకి మార్చారు. రెవెన్యూ సిబ్బంది కార్యాలయాన్ని అక్కడనుండి ఎక్కడకు మార్చారో కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థిని విద్యార్థులు కొత్తూరు కొత్త సచివాలయం వద్ద విచారించి రెవెన్యూ సిబ్బంది కోసం ప్రదక్షణలు చేస్తున్నారు. వీఆర్వో కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది చరవాణి నెంబర్లు కూడా ప్రదర్శించక పోవడంతో సచివాలయం సిబ్బంది ద్వారా వీఆర్వో గర్వాణి నెంబర్ తెలుసుకొని ఆయనకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రావడం లేదని స్థానిక పార్ధ సచివాలయం ప్రాంతానికి చెందిన కడలి సీతామహాలక్ష్మి ఆమె మనవరాలు ఆవేదన వెలిబుచ్చారు. కొత్తూరు గ్రామ రెవెన్యూ సిబ్బంది గ్రామ ప్రజలకు, రైతులకు గృహ నిర్మాణ లబ్ధిదారులకు, విద్యార్థులకు అందుబాటులో ఉండడం లేదని, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఎక్కడుంటారో, ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని, గ్రామస్తులు వాపోతున్నారు. మండల రెవెన్యూ అధికారి చర్యలు తీసుకుని రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, గ్రామస్తులు కోరుతున్నారు.

## జిల్లాలో నవంబర్ 15న 'స్వర్ణ
# ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం

* వ్యక్తిగత మరియు సమాజ పరిశుభ్రత ఇతివృత్తంతో విస్తృత కార్యక్రమాలు
* జిల్లా కలెక్టర్ షణ్మోహన్




**కాకినాడ, నవంబర్ 13 పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ నెల నవంబర్ 15న "వ్యక్తిగత మరియు సమాజ పరిశుభ్రత" అనే ఇతివృత్తంతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా పరిశుభ్రత, పారిశుద్ధ్య విలువలు, పౌరులభాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యమని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, మున్సిపల్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలన, పరిశుభ్ర జీవనశైలికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తూ, వాష్ (వాటర్, శానిటేషన్ %డ% హైజీన్) కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. అలాగే కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు చుట్టూ శుభ్రపరిచే డ్రైవ్‌లను నిర్వహించాలని, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో కొత్త పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాలని ఆయన తెలిపారు. పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లు, బస్సు స్టాండ్లలో ఉన్న టాయిలెట్ల ను పునరుద్ధరించడంతో పాటు, జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ప్రజా మరుగుదొడ్ల లభ్యతను నిర్ధారించడానికి ఎన్‌హెచ్‌ఏఐ, రాష్ట్ర రహదారి విభాగాలతో సమన్వయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోలు, స్వయం సహాయక సంఘాలు, ఆర్డబ్ల్యూఏలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువజన సంఘాలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే నవంబర్ 19న ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా సురక్షిత పారిశుధ్యం, టాయిలెట్ వినియోగం, పరిశుభ్రత ప్రవర్తనపై అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, ఎన్నికైన ప్రతినిధులు, విద్యాసంస్థలు ఈ కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొని స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో భాగస్వామ్యు లవ్వాలని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు.

## జగన్మోహన్ రెడ్డిని
# కలిసిన స్టాలిన్ బాబు



**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 13:** వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా నియమించిన జగన్మోహన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్టు స్టాలిన్ బాబు అన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి స్టాలిన్ బాబును దుస్సాలువాతో సత్కరించారు. పార్టీకి అంకితభావంతో కృషి చేసి భవిష్యత్తులో పార్టీని అధికారంలోనికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గ పార్టీ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణ పై వైఎస్ఆర్సిపి పిలుపుమేరకు పి.గన్నవరంలో తలపెట్టిన ర్యాలీ కార్యక్రమం భగ్నం చేసేందుకు ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించిందని స్టాలిన్ బాబు జగన్మోహన్ రెడ్డికి వివరించారు. తాను రచించిన దామోదరం సంజీవయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని స్టాలిన్ బాబు జగన్మోహన్ రెడ్డికి అందజేశారు.

# ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలకు స్పందించిన మంత్రి సుభాష్

ప్రతి అర్జీని పరిష్కరిస్తా
ప్రజలకు అండగా ఉంటా



**రామచంద్రపురం, పెన్ పవర్, నవంబర్ 13:** ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గురువారం రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ వినతి పత్రాలు మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలే తన ప్రాధాన్యతగా భావిస్తున్నానని, నియోజకవర్గ స్థాయిలోనే కాక రాష్ట్ర కార్యాలయంలో కూడా ప్రజాదర్బార్లు నిర్వహించి సమస్యలనుప రిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ, రూరల్ మండలాధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కే.గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, కూటమి పార్టీ నాయకులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సహాయానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**కాకినాడ జిల్లాల్లో ఐదుగురికి రూ.9.91 లక్షల ఆర్థిక సహాయం - రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు**





**కాకినాడ రూరల్ ,నవంబర్ 13 ,పెన్ పవర్:** కాకినాడ జిల్లా కొప్పవరం గ్రామంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద వైద్య సహాయం కోసం అర్హత పొందిన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారుఈ సందర్భంగా కాకినాడ జిల్లాకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 9,91,602/- విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ చెక్కులను ఎంపీ సానా సతీష్ బాబు పంపిణీ చేశారు.సీఎంఆర్ఎఫ్ ప్రజలకు అత్యవసర వైద్యసహాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఎంపీ పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ నిధిని మరింత వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి తెచ్చారని అన్నారు.ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం వేగంగా చేరేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. ప్రతి అవసరమైన వ్యక్తికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న నమ్మకాన్ని సీఎంఆర్ఎఫ్ బలపరుస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అరిగేల శ్రీనివాస్ (బున్ని), ఆఫీస్ ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి, అవసరాల హరి, గింజాల శ్రీనివాస్, వెన్నపు చక్రధర్, అజయ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


## ప్రపంచ దయా దినోత్సవం వేడుకలు ఘనంగా

**ప్రతీ ఒక్కరూ కరుణతో ఉండి ప్రపంచాన్ని మెరుగైన ప్రదేశంగా తీర్చిదిద్దాలి - డాక్టర్ అడ్డాల**



**కాకినాడ, నవంబర్ 13 ,పెన్ పవర్:** కాకినాడ రమణయ్యపేటలో ఐడిఎ మరియు అడబాల ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ దయా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు బలవర్ధక మందులు, పౌష్టికాహార పొట్లాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బుద్ధరాజు సత్యనారాయణ మాట్లాడుతూ, "సేవా భావంతో ప్రతీ రోజూ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ నిజమైన సేవామూర్తులు" అని అభివర్ణించారు. వీరి ఇద్దరికీ ప్రభుత్వం స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాలు అందజేయడం గర్వకారణమని తెలిపారు. అడబాల ట్రస్ట్ తరపున అడబాల రత్న ప్రసాద్ నిరంతరం వృద్ధులకు ఆహారం, వస్త్రాలు అందజేస్తూ, సేవా కార్యక్రమాల్లో నిబద్ధతతో ఉన్నారని, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ వైద్యరంగంలో అందరికీ అందుబాటులో ఉన్న సేవలు అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు.డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ, "ప్రతీ సంవత్సరం నవంబర్ 13న ప్రపంచ దయా దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ఉద్దేశ్యం మానవత్వపు విలువలను చాటడమే. కరుణ, దయ, ఇతరుల పట్ల సానుభూతి మతం, జాతి, లింగం, ప్రాంతం లాంటి విభజనలతో సంబంధం లేకుండా ప్రతి మనిషి స్వభావంలో ఉండాల్సిన విలువలు" అని అన్నారు.అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ, "1997లో టోక్యోలో జరిగిన సమావేశంలో 'ది వరల్డ్ కైండ్‌నెస్ మూవ్‌మెంట్' ఈ దినోత్సవాన్ని ప్రతిపాదించగా, 1998లో అధికారికంగా ప్రారంభమైందని చెప్పారు. ఇతరుల పట్ల గౌరవంగా, ప్రేమతో వ్యవహరించడం, కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలవడం, కృతజ్ఞతాభావం వ్యక్తపరచడం ద్వారా సమాజం మెరుగైన దిశగా సాగుతుందని" వివరించారు.ఈ కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ - రూ.3.10 కోట్లతో తిప్పరాజుపాలెం-కాజులూరు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన





**కాజులూరు, నవంబర్ 13 ,పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ, పట్టణ రోడ్లకు మహర్దశ ఏర్పడిందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.గురువారం ఆయన తిప్పరాజుపాలెం నుంచి కాజులూరు (శేరులంక వరకు) రూ.3.10 కోట్ల వ్యయంతో 4.8 కిలోమీటర్ల పొడవులో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ు "గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోడ్లు శిథిలావస్థకు చేరుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకున్న తర్వాత గుంతల పూడ్చడం, కొత్త రోడ్ల నిర్మాణం వంటి పనులకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది," అన్నారు.అలాగే ఆయన మాట్లాడుతూ "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి గ్రామానికి రోడ్డు, లైటు, తాగునీరు వంటి వసతులు అందించడమే మా లక్ష్యం," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ %డ% బీ డి.ఈ. శ్రీనివాస్, ఏ.ఈ.ఈ. లక్ష్మీ ప్రసన్న, మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, అన్యం శ్రీరామ్, గ్రామ సర్పంచ్ యాళ్ళ మాణిక్యంబ, కూటమి పార్టీ నాయకులు పేపకాయల నారాయణ,బండారు సత్యనారా యణ, ఎన్. వీరబాబు, వి. సత్యనారాయణ, సిహెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చొరవ చూపితేనే సంపద సృష్టి

- జిల్లా పరిషత్ సీఈవో శ్రీహరి
- చెత్త సేకరణ పై గుడివాకలంక ప్రజలకు అవగాహన కార్యక్రమం



**ఏలూరు నవంబర్ 13 పెన్ పవర్:** గ్రామాలలో ప్రజలు, నాయకులు,సిబ్బంది చొరవ చూపితేనే, సంపద కేంద్రాలలో సంపద సృష్టించడం జరుగుతుందని, ఏలూరు జిల్లా పరిష సీఈఓ అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు రూరల్ మండలంలోని పలు గ్రామాలలో రూ.8 లక్షల నుంచి 14 లక్షల వ్యయంతో ప్రభుత్వం సంపద కేంద్రాలను నిర్మించిందని, జరుగిందని అన్నారు. గ్రామంలో ఇళ్లల్లో పొడి చెత్త ,తడి చెత్తను వేరువేరుగా పారిశుధ్య కార్మికులకు అందించే విషయంలో పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. బుధవారం గుడివాడ లంక గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన చెత్తను, కేంద్రాలకు సంపద కేంద్రాలకు తరలించేందుకు పారిశుద్ధ్య కార్మికులను, హరిత రాయబారులను నియమించిందని,కృత్రిమ ఎరువుల తయారీకి ప్రభుత్వం యంత్రాలను ఏర్పాటు చేసిందని, సేకరించిన తడి పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించి,సంపద సృష్టించేందుకు కూటమి ప్రభుత్వం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీడీవో నాగరాజు కుమారి,ఆర్డిఓ శ్రీనివాస్ కూటమి నాయకులు ఘంటసాల నాగరాజు దొరబాబు, సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకం- భద్రతకు బలం





- వందేమాతర గేయానికి గౌరవం
- కాకినాడ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన అవగాహన ర్యాలీ

**కాకినాడ, నవంబర్ 13 పెన్ పవర్:** రోడ్డు ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణం, దేశభక్తి గేయం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు కాకినాడ ట్రాఫిక్ పోలీసులు బుధవారం జగన్నాథపురంలోని ఏ ఎస్ డి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "హెల్మెట్ వాడకం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదు, వ్యక్తిగత భద్రతకు అవసరం. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలనురక్షించుకోవచ్చు" అని సూచించారు.ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్ చేయరాదని హెచ్చరించారు. అలాగే వందేమాతర గేయం పట్ల గౌరవభావం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.ర్యాలీ బాలాజీ చెరువు సెంటర్ నుండి ప్రారంభమై జగన్నాథపురం పాత బ్రిడ్జి, చర్చి స్క్వేర్ సెంటర్ మార్గంగా కాలేజీ వరకు సాగింది.అదేవిధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు ు ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్, డిజిటల్ అరెస్టులు వంటి వాటి గురించి వివరించి, 112/100, 1930, 1972 నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఎన్. రమేష్, డి. రామారావు, ట్రాఫిక్ ఎస్ఐలు మరియు కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ కొరకు దరఖాస్తు చేసుకోండి



**అమలాపురం, పెన్ పవర్, నవంబర్13:** ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈనెల 20 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించుట జరిగినదని డీటీఓ పేర్కొన్నారు. ఈ నెల 20 లోపుల ఆసక్తి గల అభ్యర్థులు డీపిఆర్ నకలను, ఇతర అటాచ్ మెంట్లను స్థానిక జిల్లా రవాణాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇందుకు కావాల్సిన అర్హతలు: ఆసక్తి గల సంస్థ ఎన్జీఓ, ట్రస్ట్, కోపరేటివ్ సొసైటీ, తయారీదారుడు ఫార్మ్ అయి ఉండాలన్నారు. ఎన్జీఓ అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్ లో రిజిస్టర్ అయి ఉండాలి. ఈ సంస్థ గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్న్ ఓవర్ సర్టిఫికెట్స్అందించాలి. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్ షాప్, క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్ తదితర సదుపాయాలు ఉండాలి. ధరఖాస్తు లను జిల్లా కలెక్టర్ ఆమోదం కొరకు పంపబడునని తెలిపారు. మరిన్ని వివరాలకొరకు డీ.టీ.ఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## శ్రీ శైలం దేవస్థానంలో రామాంజనేయ డాన్స్ అకాడమీ నృత్య ప్రదర్శన






**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 13:** కార్తీక మాసోత్సవం పురస్కరించుకొని పరమశివుని సన్నిధిలో శాస్త్రీయ కూచిపూడి నృత్య ప్రదర్శన చేయడానికి అవకాశం రావడం పరమశివుని అనుగ్రహమని నాట్యగురువు నాగిరెడ్డి దుర్గాప్రసాద్ సంతోషం వ్యక్తం చేసారు. ఇందుపల్లి గ్రామానికి చెందిన శ్రీ రామాంజనేయ డాన్స్ అకాడమీ విద్యార్థులు కార్తీక మాసం సందర్భంగా శ్రీ శైలం, శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి వారి దేవస్థానం లో కార్తీక మాసోత్సవ కళా వేదిక పై శాస్త్రీయ కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. చిన్నార నృత్య ప్రదర్శన భక్తుల ను ఆకట్టుకుందని అన్నారు. స్వామి వారి అనుగ్రహానికి పాత్రులమయ్యామని, ఇది మా డాన్స్ అకాడమీ విద్యార్థులు చేసుకున్న అదృష్టం అని నాట్య గురువు దుర్గాప్రసాద్ సంతోషం తో తెలిపారు. అనంతరం కోటప్పకొండ, ఇంద్రాకిలాద్రి దర్శించుకుని స్వగ్రామం చేరుకున్నాం అని తెలిపారు.

## నేటి నుండి పెదపాడు శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**ఏలూరు నవంబర్ 13 పెన్ పవర్ :** ఈ నెల 14వ నుండి 20 వరకు పెదపాడు తృతీయ శ్రేణి గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి దుగ్గపాటి జాన్ బాబు తెలిపారు. ఈ వారోత్సవాల్లో గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే వారోత్సవాల లక్ష్యం అన్నారు. ఈ వారోత్సవాల పోస్టర్ ను బుధవారం పెదపాడు మండల తహసీల్దార్ కృష్ణ జ్యోతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా 15వ తేదీన పుస్తక ప్రదర్శన మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16వ తేదీన ఎస్ ఆర్ రంగనాథన్ పాతూరి నాగభూషణం అయ్యంకి వెంకట రమణయ్య తదితరులకు నివాళులు అర్పించుట, అనంతరం స్వచ్ఛభారత్ ఆవశ్యకత పై విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17వ తేదీన కవి సమ్మేళనం సెమినార్లు రచయితల సదస్సులు అనంతరం వకృత్వ పోటీలు, 18వ తేదీన క్విజ్ పోటీలు, 19వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ సాధికారతపై చర్చ, తుఫానులు వాటి వలన కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, 20వ తేదీన డిజిటల్ గ్రంథాలయాల వినియోగం, అనంతరం వారోత్సవాల ముగింపు సభ జరుగుతోందని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ జ్యోతి, మండల రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఆర్థిక సహాయం అందజేత




**శంఖవరం, నవంబర్ 13 పెన్ పవర్:** శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన పల్లేటి అర్జునుడు ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబాన్ని పరామర్శించిన జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన తలపంటి బుజ్జి, అవసర సమయంలో ప్రజల పక్కన నిలబడటం ప్రతి జనసైనికుడి బాధ్యత అని పేర్కొన్నారు.

# కాజులూరులో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

* రైతులు తేమ శాతం 17% లోపే ఉంచితే పూర్తి మద్దతు ధర లభ్యం



**కాజులూరు, నవంబర్ 13 పెన్ పవర్:** ఖరీఫ్ 2025 సీజన్‌కు సంబంధించి కాజులూరు మండలంలో మొత్తం 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం సాధారణ రకాలైన స్వర్ణ, ఎంటియు 1318 రకాల బియ్యానికి 75 కేజీల బస్తాకు రూ. 1777/-, అలాగే సన్న రకం ధాన్యాలకు రూ. 1792/-గా ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి )ను నిర్ణయించింది. రైతులు తమ ధాన్యాన్ని తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లి అమ్మాలని అధికారులు సూచించారు. తేమ శాతం 17 లోపుగా ఉంటే ప్రభుత్వం నిర్ణయించిన పూర్తి మద్దతు ధర లభిస్తుందని కాజులూరు మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ తెలిపారు.

# డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపల్‌కు జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 13:**
పశ్చిమగోదావరి జిల్లా న్యూ ఆరుగోలనులోని డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ గురుకులం (బాయ్స్) ప్రిన్సిపల్ శ్రీ బి. రాజా రావు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన "జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు (National Best Principal Award)" అందుకున్నారు.

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేయబడింది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, నాయకత్వ గుణాలను అభివృద్ధి చేయడం, అలాగే పాఠశాల స్థాయిలో అద్భుతమైన అకడమిక్ ఫలితాలు సాధించడంలో చూపిన విశిష్ట సేవలను గుర్తించి శ్రీ రాజా రావును ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

ఈ గౌరవాన్ని ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ డైరెక్టర్లు శ్రీమతి ఎం. మాధుమతి మరియు శ్రీ ఎం. నాగదీశ్ నవంబర్ 9న ముంబై, మహారాష్ట్రలో జరిగిన కార్యక్రమంలో శ్రీ బి. రాజా రావుకు అందజేశారు.

ఈ విజయంపై గురుకులం సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యారంగంలో ఇలాగే మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.

# పశ్చిమగోదావరి జిల్లా పోలీసులు 11వ విడతలో 126 మొబైల్ ఫోన్లను యజమానులకు అందజేత





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 13:**
పశ్చిమగోదావరి జిల్లా పోలీసు కార్యాలయం, భీమవరం ఆధ్వర్యంలో గురువారం (నవంబర్ 13) గొల్లలకోడేరులో జరిగిన కార్యక్రమంలో చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల 11వ విడత రికవరీ మరియు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్., గారు సుమారు ?18,90,000/- విలువగల 126 మొబైల్ ఫోన్లను వాటి యజమానులకు స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ చేజారిన లేదా దొంగిలించబడిన పక్షంలో ఎవరైనా "9154966503" వాట్సాప్ నంబర్‌కి "%ఎఱ%" లేదా "%ఎవశ్రీజూ%" అని మెసేజ్ పంపి వచ్చిన లింక్ ద్వారా ఆన్లైన్‌లో వివరాలు నింపితే, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫోన్‌ను తక్షణమే రికవరీ చేసి యజమానికి అందించే అవకాశం ఉంటుందని ఎస్పీ గారు తెలిపారు. ఈ విధానం ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుందని, జిల్లావాసులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇప్పటి వరకు నిర్వహించిన 11 విడతల ద్వారా మొత్తం 2 కోట్ల 60 లక్షల రూపాయల విలువగల 1738 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేసినట్లు ఎస్పీ గారు వెల్లడించారు.

అదే సమయంలో దొరికిన సెల్ ఫోన్లను సొంతంగా వాడుకోవడం, గుర్తు తెలియని వ్యక్తుల నుండి బిల్లులు లేని ఫోన్లు కొనడం చట్టపరంగా తప్పని, అలా చేస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని ఎస్పీ గారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మొబైల్ ఫోన్ ట్రాకింగ్ బృందానికి నాయకత్వం వహించిన మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీమతి అహ్మదున్నిషా గారు మరియు వారి బృంద సభ్యులు %ూూ×% డి. రత్నారెడ్డి, %ఎజ% వి. జి. ఎస్. కుమార్, బి. శ్రీనివాస్, కె. వెంకటేశ్వరరావు, %ఔఎజ% పి. లక్ష్మికుమారి, %ూజ%లు కె. పాపారావు, కె. ప్రసాద్ బాబు, కె. అబ్బాస్, ఎస్. భాస్కర్, ఎం. వి. డి. ప్రసాద్, ఎం. అనిల్ కుమార్ గార్లను ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) శ్రీ వి. భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ కె. వి. వి. ఎన్. సత్యనారాయణ, డి. సి. ఆర్. బి ఇన్స్పెక్టర్ శ్రీ డి. వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీమతి అహ్మదున్నిషా తదితర అధికారులు పాల్గొన్నారు.



# రేషన్ బియ్యం పక్కదారి పడితే తాట తీస్తా...






* అక్రమ రవాణాపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీరియస్
* పట్టిచ్చిన వారికి రూ 5 వేల బహుమతి

**కోరుకొండ, పెన్ పవర్, నవంబర్ 13:** రాజానగరం నియోజకవర్గంలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడితే సహించేది లేదని బాధ్యుల తాట తీస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తీవ్రంగా హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఏఎస్ఓలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమ రవాణాదారులు తన పేరు వాడుకుని వ్యాపారం సాగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రేషన్ బియ్యం ద్వారా డబ్బులు సంపాదించుకునే అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నవారిని పట్టుకున్న వారికి, లేదా సమాచారం ఇచ్చిన వారికి రూ. 5 వేల బహుమతిని ఎమ్మెల్యే ప్రకటించారు. పేదలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

# "మీ డబ్బు - మీ హకు" ప్రత్యేక ప్రచారం

## బ్యాంకుల్లో నిలిచిన ఖాతా సొమ్ము తిరిగి పొందే అవకాశం

**కాకినాడ, నవంబర్ 13 పెన్ పవర్:** భారత ప్రభుత్వం మరియు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో "మీ డబ్బు - మీ హకు" నినాదంతో అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సీ. హెచ్. ఎస్. వి. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా, కాకినాడ లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నవంబర్ 14న తిలక్ స్ట్రీట్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 10 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలంగా లావాదేవీలు జరగని ఖాతాల్లోని సొమ్మును అర్హులైన ఖాతాదారులకు తిరిగి అందించే అవకాశం కల్పించబడుతుంది. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, నామినీ వివరాల్లో లోపాలు, లేదా ఖాతా మర్చిపోవడం వంటి కారణాలతో డబ్బు చేరని ఖాతాలను గుర్తించి, సరైన ధృవపత్రాలు సమర్పించి, ఈ-కేవైసీ పూర్తి చేసి తమ సొమ్మును తిరిగి పొందవచ్చని ఎల్డీఎం ప్రసాద్ తెలిపారు. అర్హులైన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్:

"నా ఊపిరి ఉన్నంతవరకు రాజకీయాల్లోనే ఉంటా.. ప్రజలకు సేవ చేయడం నా లక్ష్యం"






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 13:**
పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని రూరల్ మండలం, చిన్న తాడేపల్లిలో జనసేన పార్టీలో చేరికల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, "నా ఊపిరి ఉన్నంతవరకు రాజకీయాల్లోనే ఉంటాను. ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అవకాశం ఇస్తే రాబోయే ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా పోటీ చేస్తాను" అని తెలిపారు.

ఎన్నికల వరకే రాజకీయాలు కాదు, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేయడం తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. "నా విజయం కోసం కష్టపడ్డ ప్రతి కూటమి నాయకుడు నా గుండెల్లో ఉన్నాడు. జనసేన పార్టీలో చేరిన వారిని కూడా అదే ప్రేమతో చూడబోతున్నాను" అని చెప్పారు.

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే కొందరు తమను బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. "నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేలు లేరు. ప్రజల మేలు కోసం ఆలోచించే ప్రతి ఒక్కరినీ నేను ఎమ్మెల్యేగా భావిస్తాను" అని శ్రీనివాస్ తెలిపారు.

అంతేకాక, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన రాష్ట్రాన్ని దెబ్బతీసిందని, ఆయనను మళ్లీ అధికారంలోకి రానివ్వకూడదని పిలుపునిచ్చారు. "నియోజకవర్గ అభివృద్ధి, సుపరిపాలన అందించడమే నా లక్ష్యం. అవినీతి చేశానని ఎవరైనా అనుకుంటే సాక్ష్యాలు చూపండి. నాకు లంచం ఇచ్చిన వారు ఉంటే ముందుకు రావాలి" అంటూ సవాల్ విసిరారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిచ్చుకల రాజారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 200 మంది కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. చేరిన వారిలో ఎంపీటీసీ దూలపల్లి సత్తయ్య, పిచ్చుకల అమ్మన్న, మాజీ సర్పంచ్ బయ్యే వెంకట్రావు, మాజీ ఉపసర్పంచ్ పరిమి రాంబాబు, పంచాయతీ బోర్డు సభ్యులు కాసాని వీరరాఘవులు, గొల్లపల్లి ధర్మరాజు, కొక్కిరాల గోవిందు, మెడవంకల పెద్దిరాజు, దూలపల్లి నర్సమ్మ, తొంటా రాంబాబు తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, పైబోయిన రఘు, తోట రాజా, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబీ తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకు వంతెనపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలిపిన కంబాల




* నమో యాప్ లో రెండు లక్షల పాయింట్లుతో ఏపీ నుంచి మొదటి స్థానంలో నిలిచాము
* రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు

**గోకవరం , పెన్ పవర్,నవంబర్ 13:** గోకవరం ఠాణా సెంటర్, దేవిచౌక్ సమీపంలో ఉన్న అతి పురాతనమైన ఇరుకు వంతెన స్థానంలో నూతన పెద్ద వంతెన నిర్మించాలని కోరుతూ, బుధవారం గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి విచ్చేసిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి తన తరపున గోకవరం బీజేపీ నాయకులు వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించి, నూతన పెద్ద వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీ ఉదయం శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిలకు కంబాల శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక సీఎండీ లే అవుట్ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోకవరం ప్రజలతో పాటు ఏజెన్సీ ప్రజలకు అతి ప్రధాన సమస్యగా మారిన దేవిచౌక్ సమీపంలో ఉన్న ఇరుకు వంతెన గురించి ఎన్నోసార్లు అనేకమంది పలు ప్రయత్నాలు చేశారని అన్నారు. తాను అందుబాటులో లేకపోయినప్పటికీ బిజెపి నాయకులు నా తరుపు నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ కి వినతి పత్రం అందజేసి. ఇరుకు వంతెన వల్ల ఎన్ని, ఇబ్బందులు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనేది వివరించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వినతి పత్రాన్ని క్షుణ్ణంగా చదివి, శ్రద్ధ చూపించి వెంటనే అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కూడా ఆదేశాలు జారీ చేశారన్నారు. వారి ఆదేశాలు అనుకూలంగా కలెక్టర్ కీర్తి చేకూరి స్థానిక రెవిన్యూ అధికారులకు పనులు మొదలు పెట్టాలని తెలపడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పత్రికా ముఖంగా వారందరికీ కంబాల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతి నెల నాలుగో ఆదివారం మన్ కి బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అనేక సందేశాలను అందించి, నమో యాప్ ద్వారా ప్రజలకు మన దేశానికి చేరవేస్తున్నారని అన్నారు. నమో యాప్ లో రెండు లక్షలు పైగా పాయింట్లు సాధించి ఏపీ నుంచి మొదటి స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. అలాగే లీడర్ స్కోర్ లో బ్లూ బ్యాడ్జి కలిగిన వ్యక్తిగా నిలవడం జరిగిందన్నారు. స్వదేశీ వస్తువుల్ని వాడాలని, కేంద్ర పథకాల గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం నమో యాప్ లో రెండు లక్షలు పాయింట్లు సాధించిన సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్, దేశాల నరేష్, మండే గౌతమ్, తటికొండ సురేష్, నెల్లి శ్రీను, కాకర దుర్గారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడికి మంత్రి కందుల దుర్గేష్ భరోసా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 13** : మంత్రి కందుల దుర్గేష్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. తనను నమ్మి తన ఇంటి వద్దకు వచ్చిన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం, నామవరం శాటిలైట్ సిటీకి చెందిన కండిపిల్లి ప్రసన్నకుమార్ అనే విభిన్న ప్రతిభావంతుడికి తానున్నానంటూ మంత్రి కందుల దుర్గేష్ భరోసానిచ్చారు. వివరాల్లోకి వెళ్తే, సదరం సర్టిఫికెట్ లో నూటికి నూరు శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ కం డిపిల్లి ప్రసన్నకుమార్ కు ఆధార్ బయోమెట్రిక్ పడటం లేదన్న కారణంతో గత కొంతకాలంగా పెన్షన్ అందడం లేదని, గతం లో దివ్యాంగుల పెన్షన్ రూ. 6000 వచ్చేదని మంత్రి దుర్గేష్ కు సమస్యను విన్నవించు కున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ బయోమెట్రిక్ సెంటర్ వారితో తాను చర్చిస్తానని కాకినాడ వెళ్లి అప్డేట్ చేసుకోమని మంత్రి దుర్గేష్ సూచించారు. కలెక్టర్ ఆఫీస్ కు సంబంధిత సమాచారం చేరవేసి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కోటాలో నెలకు రూ. 15,000 పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటానని ప్రసన్నకుమార్ కు మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. తనను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చిన ప్రసన్నకుమార్ కు ఆటో ఖర్చుల రూపేణా వ్యక్తిగత సాయంగా రూ. 2000 అందించారు. మంత్రి దుర్గేష్ స్పందించిన తీరుపై ప్రసన్నకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

# డెంగ్యూ పాజిటివ్ కేసుతో మోడేకూరు పంచాయతీలో దోమల నిర్మూలన చర్యలు







**కొత్తపేట,పెన్ పవర్, నవంబర్ 13:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకూరు గ్రామపంచాయతీ పరిధిలోని చిట్టురీవారిపాలెం గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో గురువారం పంచాయతీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమయ్యారు.సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి వెంకటేశ్వరరావు, సెక్రటరీ వాసు, పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామంలో విస్తృతంగా దోమల నివారణ చర్యలు చేపట్టారు. నీటి గుంటల్లో అబేటీ క్రిమిసంహారిని స్ప్రే చేయడం, ఇళ్లలో పైరేత్రం స్ప్రేయింగ్ నిర్వహించడం జరిగింది.

ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ సర్వే చేసి, జ్వర కేసులు ఉన్నాయా అనే దానిపై పరిశీలించారు. నీటి నిల్వలలో దోమల లార్వా ఉన్న చోట్ల వాటిని తొలగించారు.

జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు గురువారం గ్రామానికి విచ్చేసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. లార్వా ఉన్న ప్రదేశాలను గుర్తించి ప్రజలకు జాగ్రత్త చర్యలు వివరించారు. గృహాల ప్రక్కన మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాలను ప్రజలు గుర్తించి, వాడివేసిన కొబ్బరి బొండాలను, నిల్వ నీరు ఉన్న పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని ప్రజలకు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరును సమీక్షించి, మరిన్ని డెంగ్యూ కేసులు రాకుండా తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్. రాజబాబు, యమ్.పి.హెచ్.యస్. చందు, హెల్త్ అసిస్టెంట్ పి. వెంకటేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్య లకు టిడిపి కార్యాలయం లో నేడు గ్రీవెన్స్

**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 13:** పర్జా సమస్యల పరిష్కార వేదికగా పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కో కన్వీనర్లు దాసరి వీర వెంకట సత్యనారాయణ, మోకా ఆనంద సాగర్ తెలిపారు.

ఉదయం 10 గంటల నుండి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుగుదేశం పార్టీ గ్రీవెన్స్ ద్వారా ప్రజలనుండి వినతి పత్రములు స్వీకరించడంజరుగుతుందని అన్నారు. . కార్యకర్తల నుండి ప్రజల నుండి వచ్చిన వినతులను స్థానిక అధికారులు ద్వారా పరిష్కారం అయ్యే వాటిని పరిష్కరించి, శాసనసభ్యులు ద్వారా పార్లమెంట్ సభ్యుల ద్వారా, జిల్లా ఇన్చార్జ్ మంత్రి, జిల్లా మంత్రుల పరిధిలో, వున్న వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. మిగిలిన వాటిని అధిష్టానం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ కార్యక్రమము ప్రతి శుక్రవారం ఉదయం 10.00 నుండి సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గ కో కన్వీనర్లు దాసరి వీర వెంకట సత్యనారాయణ, మోకా ఆనంద సాగర్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటామని తెలిపారు.

# ఘనంగా కార్తీక వన సమారాధన



**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 13:** కార్తీక మాసం పురస్కరించుకొని అంబాజీపేట మార్కెట్ యార్డ్ లో గురువారం కార్తీక వన సమారాధన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి రైతులు వ్యాపారులు కార్తీక దామోదర పూజలు నిర్వహించారు. వ్యవసాయ పంటలు బాగా పండాలని రైతులు ఆర్థిక పురోగతి పెంపొందాలని కోరుకున్నారు.

అనంతరం అన్న సమారాధన జరిపారు. అరటి రైతులు వర్తకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపల్‌కు జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 13:** పశ్చిమగోదావరి జిల్లా న్యూ ఆరుగోలనులోని డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ గురుకులం (బాయ్స్) ప్రిన్సిపల్ శ్రీ బి. రాజా రావు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన "జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు (%చీఖఅశీఖశ్రీ దీవర్ౌతీఅఅఎఅజూఖశ్రీ ాూఖుతీస%)" అందుకున్నారు.

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేయబడింది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, నాయకత్వ గుణాలను అభివృద్ధి చేయడం, అలాగే పాఠశాల స్థాయిలో అద్భుతమైన అకడమిక్ ఫలితాలు సాధించడంలో చూపిన విశిష్ట సేవలను గుర్తించి శ్రీ రాజా రావును ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ గౌరవాన్ని ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ డైరెక్టర్లు శ్రీమతి ఎం. మాధుమతి మరియు శ్రీ ఎం. నాగదీశ్ నవంబర్ 9న ముంబై, మహారాష్ట్రలో జరిగిన కార్యక్రమంలో శ్రీ బి. రాజా రావుకు అందజేశారు.

ఈ విజయంపై గురుకులం సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యారంగంలో ఇలాగే మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.ద

# అరకు పార్లమెంటరీ కార్యదర్శిగా పాటి.చలపతి నియమకం..

ఎమ్మెల్యే చేతుల మీదుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పాటి చలపతి.



**ఎటపాక,పెన్ పవర్ ,నవంబర్ 13:** అల్లూరి జిల్లా రంపచోడవరం లో గురువారం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన నాయకులకు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, అందులో భాగంగా అరకు పార్లమెంటరీ కార్యదర్శి పాటి. చలపతిని ఎన్నుకోవడం జరిగిందని తెలుపుతూ, సాలువాతో సన్మానించి పదవి బాధ్యతలను అప్పజెప్పారు,ఎటపాక మండల పరిధిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా మొదలుకొని మండలంలో ఉన్నటువంటి నాయకులతోపాటు కలిసి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేసిన వ్యక్తి పాటి.చలపతి అని గుర్తించి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, చిన్నం బాబు రమేష్ లు పార్టీ కోసం కష్టపడిన వారికి ఎప్పుడూ ఉన్నతమైన పదవులు దక్కుతాయని అన్నారు, కష్టపడిన వారిని గుర్తించి వారి సేవలకు మెచ్చుకొని అరకు పార్లమెంటరీ కార్యదర్శిగా పాటి చలపతిని నియమించమని అన్నారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నలజాల శ్రీకాంత్, పాటి సంపత్, చేకూరు కొండ, కనితి మధు, లాయర్ రవితేజ, దొండపూడి రాంబాబు, శుక్ర నాయక్, నరసింహారావు, లంక అవినాష్, పాలడుగు నవీన్, ఎటపాక మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.



**కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్ 13:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని నాగం సుధామాదిరి పిలుపునిచ్చారు.గురువారం కిర్లంపూడి మండలం ముక్కోల్లు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాగం సుధామాధురి మాట్లాడుతూ ప్రస్తుతం కోతలు అవుతున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి రైతులకు వివరించారు. కిర్లంపూడి మండలంలో మొత్తం 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులందరూ తమ ధాన్యాన్ని రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన దాన్యం కొలుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు తెచ్చిన ధాన్యానికి 17 తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు.సాధారణ రకములు 75 కేజీలకు 1777 రూపాయలు, గ్రేడ్ ఏ రకమునకు 75 కేజీలకు 1792 ధర నిర్ణయించడం జరిగిందని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# అధికారులు అక్రమ కట్టడాలకు అడ్డుకట్టు వేయలేరా కుంజా. శ్రీను..



**అడ్డతీగల, పెన్ పవర్,నవంబర్ 13 :** అడ్డతీగలలోరోడ్లు విస్తరణలో భాగంగా రోడ్డు ప్రక్కన ఉన్న ఆక్రమణలను అధికారులు ఆదేశాల మేరకు గతంలో తొలగించడం జరిగింది. ఒక ఆక్రమణదారుడు రోడ్డుకు అతి దగ్గరలో నిర్మాణం సాగిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని కుంజ. శ్రీను ఆరోపించారు.ఈ నిర్మాణం రాత్రి సమయంలో జరిగిందని మరుసటి రోజు అధికారులు వెళ్లి నిర్మాణాన్ని తీసివేయాలని, చెప్పినప్పటికీ రెవెన్యూ అధికారులపై ఆక్రమణదారుడు దురుసుగా ప్రవర్తించాడని కుంజా. శ్రీను ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా తొలగించిన ఆక్రమణంలో నిర్మాణాలు నిలుపుదల చేయాలని కుంజ.శ్రీను డిమాండ్ చేశారు. ఈ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించకపోతే ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## చిరుధాన్యాలు పంట రైతులకు లాభసాటిగా ఉంది



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 13**: ప్రస్తుతం చిరుధాన్యాలు పంట రైతులకు లాభసాటిగా ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. జగంపేట మండలం మర్రిపాక గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ, జిల్లా మండల వనరుల కేంద్రం, పెద్దాపురం వారి ఆధ్వర్యంలో చిరుధాన్యాలు వాటి ఉత్పత్తులు శిక్షణ కార్యక్రమం జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం నిర్వహించారు. రాగి సాగు చేసే విధానం తెలిపారు. వరి సాగువలన ఎక్కువగా లాభం ఉండడం లేదని ఇటువంటి చిరుధాన్యాల ద్వారా ప్రస్తుతం బయట మార్కెట్లో ఎక్కువ ధర ఉందన్నారు. పెద్దాపురం అసిస్టెంట్ డైరెక్టర్ గిరి మాలకొండయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగు యొక్క ప్రాముఖ్యత మరియు సాగు చేసుకునే విషయాలను రైతులకు తెలియజేసారు. జిల్లా ఆఫీసర్ సంజయ్ చిరుధాన్యాలతో పాటుగా వాటి యొక్క ఉత్పత్తులను ఏ విధంగా చేసుకొని మార్కెట్లో అమ్మితే లాభాలు వస్తాయో వివరించారు. జగ్గంపేట సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఎప్పుడూ ఒకే పంట మీద ఆధారపడకుండా వివిధ పంటల ద్వారా లాభం పొందాలన్నారు. ఏవో నరసింహం మాట్లాడుతూ గతంలో చిరుధాన్యాలు సాగు వల్ల ఎక్కువ ఆరోగ్యకరంగా ఉండే వారని రానురాను ఈ చిరుధాన్యాలు సాగు తగ్గించి వరి మీద ఎక్కువ ఆధారపడి ఉండవల్ల రైతులు పెట్టుబడి అయితే పెరుగుతుంది కానీ లాభసాటి వ్యవసాయం లేదన్నారు. రైతు తనకున్న పొలంలో ఒక పది సెంట్లు అయినా రాగి సాగు చేస్తున్నట్లయితే వాళ్ల కుటుంబం కోసం అయినా నాణ్యమైన ఉత్పత్తులు పండించుకుని ఆరోగ్యకరంగా ఉండాలని సూచించారు. అలాగే రైతులు బాగా ధాన్యం ఆరబెట్టి ప్రతి రైతు సేవ కేంద్రంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకుని ప్రభుత్వం మద్దతు ధరలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపాక గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రిక, రైతులు పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రంథాలయ వారోత్సవ వేడుకలు

గ్రంథాలయ అధికారిని గంగాభవాని

**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 13:** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు స్థానిక శాఖ గ్రంథాలయ అధికారిని గంగాభవాని తెలిపారు. శుక్రవారం జాతీయపతాక ఆవిష్కరణతో వారోత్సవాలను ప్రారంభించి 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం చిత్రలేఖనం పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.

## గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్రక్కు మాయం...

* సిబ్బంది పని తీరు పై గ్రామస్తులు ఆగ్రహం



**కపిలేశ్వరపురం పెన్ పవర్ నవంబర్ 13:** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ట్రక్కు మాయం అయింది. గ్రామంలో రోడ్లు తడిపేందుకు, అలాగే డ్రైనేజీ లో పేరుకుపోయిన శిల్ట్ తీయడానికి, గతంలో ట్యాంక్ నిర్మాణం తో కూడిన ట్రక్కును గ్రామంలో ఉపయోగించేవారు. గత కొంత కాలం నుండి ఈ ట్రక్కు దుర్గమ్మ గుడి వీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న కాళీ స్థలంలో దీనిని ఉంచారు. గ్రామంలో కొంత మంది వారి స్వప్రయోజనాలకు కూడా ఈ ట్రక్కునే ఉపయోగించుకునేవారు. ట్రక్కు మాయమై సుమారు 4 మాసాలైన ఇక్కడ లేదనే విషయాన్ని పంచాయతీ సిబ్బందికి తెలియకపోవడం శోచనీయం. ప్రజా ధనముతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి గ్రామ ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి వస్తువులు మాయమవుతున్నా పంచాయతీ అధికారులు కళ్ళుమూసుకుని వ్యవహరిస్తున్న తీరు దారుణంగా కనిపిస్తోంది. రెండు రోజుల క్రితం ఈ విషయం కార్యదర్శి రాయుడు మోహన్ దృష్టికి రావడం తో అంగర పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు అయన గురువారం విలేకరులకు తెలిపారు. గతంలో ఈ పంచాయతీలో పని చేసిన కార్యదర్శులు రికార్డులు పూర్తి స్థాయిలో అప్పగించడం లేదని తెలుస్తోంది. అంతే కాకుండా కార్యాలయానికి సంబంధించిన ఫర్నిచర్ కూడా గల్లంతైనట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నత అధికారులు దృష్టి పెట్టి పంచాయతి ఆస్తులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## బి.సి.సెల్,అధ్యక్షులుగా ముత్యాలసిద్ధార్థ(సిద్ధు)

-తెలుగుదేశం పార్టీఅధిష్టానం ఆదేశాలమేరకు



**వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్.13:** తెలుగుదేశంపార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నయువతకు పార్టీలోఅవకాశాలుఇచ్చేందుకు తెలుగుదేశంపార్టీఅధి ష్టానం ఒకఅడుగుముందుకువేస్తూ అవకాశాలు కల్పించింది. పార్టీఅవకాశాలులోభాగంగా టిడిపి పార్టీనిర్ణయంమేరకు గురువారంరంపచోడవరం నియోజకవర్గంబి.సి.సెల్, అధ్యక్షులుగాముత్యాల సిద్ధార్థ(సిద్ధు)నునియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీచేశారు.ముత్యాలసిద్ధార్థ (సిద్ధు)తెలుగుదేశం పార్టీఅధిష్టానంకు కృతజ్ఞతలు తెలిపారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమ శాంతి ర్యాలీని అడ్డుకోవడం దారుణం..



**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 13:** పేద ప్రజలకు అవసరమైనటువంటి మెడికల్ కాలేజీలు,వాటి యొక్క ఆస్తులు ప్రజలకే దక్కాలనేటువంటి వినతిని ఆర్డిఓ, తాసిల్దార్లకు ఇచ్చేందుకు కూడా అనుమతి లేదని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికే మచ్చాని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. గంగలకుర్రు మలుపు సమీపంలో వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఇంటి వద్ద విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసిన కోటమీ ప్రభుత్వం నిర్ణయాన్ని నిరసిస్తూ వైసిపి అధిష్టాన ఆదేశాల మేరకు వ్యతిరేక ఉద్యమ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న వారిని అడ్డుకోవడం, హౌస్ అరెస్టులు చేయడం దారుణమనిఅన్నారు.

పి.గన్నవరం నియోజకవర్గంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం శాంతి ర్యాలీ చేపట్టిన నియోజకవర్గ సమన్వయకర్త పైన, మాజీ ఎమ్మెల్యే,రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రతిపక్ష పార్టీలు వెలికి తీస్తే ప్రభుత్వాలు సరిచేసుకుని, అవసరమైతే తగినటువంటి ఫలాలను అందించడమే ప్రభుత్వ ముఖ్య బాధ్యత అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిరసిస్తూ అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళున్న వైసిపి నాయకులు,కార్యకర్తలపై పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. ఇంతటి దుర్మార్గమైన పాలన ఎక్కడైనా ఉంటుందా అని ప్రశ్నించారు. పేద ప్రజలకు ప్రభుత్వం ద్వారా వైద్యం అందించాల్సిన మెడికల్ కాలేజీలను మీ తాబేదారులకు వేసుకుంటే నిలదీస్తున్న ప్రతిపక్షంను ప్రబంధహస్తాలతో నొక్కి పెట్టాలనే ఆలోచన ఎంతవరకు సబబు అని అడుగుతున్నానన్నారు. ఆరోగ్య శ్రీ పథకమణం నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు వాస్తవము కాదాని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ ద్వారా సుమారు 3250 రోగాలకు ఉచితంగా వైద్యం అందించే వారిని ఇప్పుడు ఆ పరిస్థితి ఉందాని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతి పేదవాడు డబ్బులు కట్టి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మీరు సకాలంలో హాస్పిటల్స్ కి బిల్లులు చెల్లించక పోవడంతో ఉచిత వైద్యమును కూడా ఖరీదు వైద్యంగా మార్చేశారన్నారు. పక్షవాతం గురైన బాధితులకు వైసీపీ ప్రభుత్వంలో పక్షపాతం వచ్చిన రోగికి నెలకు ఐదువేలు చొప్పున ఆరు నెలలకు రూ. 30 వేలు ఆరోగ్య ఆసరా కింద అందించే వారమని, కూటమి ప్రభుత్వ అది చేస్తున్నదాని అడుగుతున్నామన్నారు. ఉచితంగా వైద్యం అందిస్తున్న ఆరోగ్యశ్రీ నిర్వీర్యం చేస్తూ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద ప్రజల వైద్యానికి ఆర్థిక సహకారం అందిస్తున్నామంటూ పత్రిక ముఖంగా హడావిడి చేయడం కోసమే కొద్ది మందికే సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ కు బిల్లును చెల్లించకుండా ప్రజల మీద కక్ష సాధించడం వాస్తవం అవునా కాదా అని స్థానిక నాయకత్వమే కాదు మేము కూడా అడుగుతున్నామని జగ్గిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 17 నెలల కాలంలో ఎంతమంది పేద ప్రజలకు ఇల్లు పట్టాలు ఎన్ని ఇచ్చారు, ఎన్ని ఇల్లు నిర్మించారో పత్రికా ముఖంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 32 లక్షల మంది ఆడపడుచులకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, వాటిలో నిర్మించుకున్న గృహ ప్రవేశాలకు పిలవైన పేరంటానికి వెళ్లి ఫోటోలు తీయించుకుని డబ్బాలు కొట్టుకుంటున్నారని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం కార్యకర్తలకు దోసి పెట్టేందుకు మరో కొత్త ప్రణాళిక రచించిందని యూనిట్ ఇన్చార్జిల రూపంలో ప్రజల పైకి పంపిస్తుందన్నారు. గతంలో జన్మభూమి కమిటీ మెంబర్లు ఉన్నారో వారిని యూనిట్ ఇన్చార్జిగా పేరు మార్చి ప్రజలను దండుకోవడానికి యూనిటీ ఇన్చార్జ్ ల చేత ప్రమాణ స్వీకారం చేయించిన విషయం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, మీ హయాంలో ఎంతమందికి ఇస్తారో ఇవ్వండన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, పెరిగిన నిత్యవసర సరుకులు కొనలేక, కరెంటు బిల్లులు కట్టలేకపోతున్నారన్నారు. ప్రజల తరఫున పోరాడేందుకు ఉద్యమాలు చేస్తూనే ఉంటామని ప్రభుత్వం ఉడత ఊపులకు, కేసులకు భయపడేది లేదని జగ్గిరెడ్డి తీవ్ర స్వరంతో అన్నారు. ప్రజల తరఫున పోరాటం చేస్తున్న పి. గన్నవరం నియోజవర్గ వైసిపి నాయకులను, కార్యకర్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని జగ్గిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి. చింతా అనూరాధ, నియోజకవర్గ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాసరావు, గన్నవరపు శ్రీ నివాసరావు, పాముల రాజేశ్వరి దేవి, పి.కె. రావు, ఎం.పి.టి.సి. దొమ్మేటి వెంకటేశ్వరరావు,, జడ్పీటిసి బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కోట బేబిరాణి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, ఎమ్.ఎమ్. శెట్టి, వాసంశెట్టి తాతాజీ, కొర్లపాటి కోటబాబు, చేట్ల రామారావు, యన్నాబత్తుల ఆనంద్, మేడిశెట్టి శ్రీ నివాసు, కొమ్ముల రాము, కుడుపూడి సత్తిబాబు , సూదాబత్తుల రాము అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల అనధికారికంగా మహిళా హాస్టల్ నిర్వహణ బి లక్షల రూపాయలు స్వాహా

హితకారిణి సమాజం ఆస్తుల అన్యాక్రాంతానికి కుట్ర

హితకారిణి సమాజం పాలకమండలి చైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 13** యావది ఆస్తి ని సమాజం కోసం, మహిళా దానమిచ్చి హితకారిణి సమాజం విద్యాసంస్థలు నెలకొల్పిన కందుకూరి వీరేశలింగం పంతులు ఆశయాలను తూట్లు పొడిచే విధంగా గత ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకవర్గం వ్యవహరించిందని పాలకమండలి చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ కుమార్ విమర్శించారు. స్థానిక ఎస్ కె ఆర్ మహిళా కళాశాల ఎంబీఏ కాన్ఫరెన్స్ హాల్లో మీడియా సమావేశంలో హితకారిణి సమాజం ఈ ఓ జి.వినోద కుమార్, పాలకమండలి డైరెక్టర్లతో కలిసి మాట్లాడారు.

ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, దాత ఆశయాలకు అనుగుణంగా తరతరాలుగా దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో ఉన్న సమాజం ఆస్తులను, విద్యాసంస్థలను గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ పరం చేయాలని గత పాలకమండలి సభ్యులు, విద్యాసంస్థలలోని కొంతమంది కుట్ర చేశారని ఆరోపించారు. అందులో భాగంగా మహిళా కళాశాలకు అనుబంధంగా మహిళా హాస్టల్ ప్రభుత్వపరంగా నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 2022 అక్టోబర్లో ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ రాఘవ కుమారి ప్రైవేటు బ్యాంకు ఎకౌంట్ల ఏర్పాటుచేసి ఆదాయాన్ని స్వాహా చేసారని ఆరోపించారు. ఆ రోజుల్లోనే రూ. 40 లక్షల రూపాయలు నిధుల నుంచి రూ.70 లక్షల రూపాయల వరకు సిఎస్సార్ నిధులకు సంబంధించి లెక్క పత్రాలు లేవని ప్రదీప్ కుమార్ ఆరోపించారు. హాస్టల్ కి సంబంధించి ఒక కోటి 30 లక్షల రూపాయలు ఫిక్స్ డ్ డిపాజిట్లు కూడా ఉన్నాయని ఈ నిధులు సంగతి తేలాల్సి ఉందన్నారు. మహిళా హాస్టల్ ను సమాజానికి స్వాధీనం చేయాలని ప్రిన్సిపాల్ రాఘవకుమారి ని 9 నెలలుగా నోటీస్ లు ఇచ్చి కోరుతున్నప్పటికీ ఆమె నుంచి స్పందన లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో హితకారిణి సమాజానికి చెందిన ఏడు విద్యాసంస్థల లో రెండు విద్యా సంస్థలను మాత్రమే విద్యాశాఖలోకి తీసుకున్నారని, మిగతా ఐదు సంస్థలను తీసుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో తిరిగి దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోకి సమాజం ఆస్తులను, విద్యాసంస్థలను తిరిగి విలీనం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈనెల 18వ తేదీన నగరానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్తామని డాక్టర్ ప్రదీప్ తెలిపారు. సమాజం ఈవో వినోద్ మాట్లాడుతూ, గత తొమ్మిది నెలలుగా మహిళా కళాశాలలోని మహిళా హాస్టల్ నిర్వాహణను ప్రిన్సిపాల్ కు 9సార్లు నోటీసులు ఇచ్చామని ఆమెను నుంచి స్పందన లేదని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈ సమావేశంలో పాలకమండలి డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు

## నేటి నుండి గ్రంథాలయ వారోత్సవ వేడుకలు

**కపిలేశ్వరపురం పెన్ పవర్, నవంబర్ 13:** స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు స్థానిక శాఖ గ్రంథాలయ అధికారిణి దానేటి శివకుమారి గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం జాతీయపతాక ఆవిష్కరణతో వారోత్సవాలను ప్రారంభించి 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం చిత్రలేఖనం పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.

## పేద ,మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న సీఎం సహాయనిధి

14 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 13**: పేద ,మధ్యతరగతి కుటుంబాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో వెలుగులు నింపుతుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.

గురువారం గోరంట్ల వారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 14 మంది లబ్ధిదారులకు రూ.12,65,349 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అందజేశారు. రూరల్ మండలం హుకుంపేట గ్రామానికి చెందిన ప్రగల్లపాటి కల్పనాకు 4,80,000, కాంద్రేగుల కృపావతికి 1,32,440-, వురా శ్రీనివాసరావుకు 95,634, కొంతమూరు గ్రామానికి చెందిన కాకిలేటి సత్యవేణికి 50,000-, పల్లి రంజిత్ కుమార్ కు 27,000, పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఉప్పలపాటి రవణకు 70,906-, తొర్రేడు గ్రామానికి చెందిన ఇరేళ్ల భీమరాజుకు 31,084, కడియం మండలం కడియం గ్రామానికి చెందిన పుట్ట సత్యనారాయణకు 49,014, జేగురుపాడు గ్రామానికి చెందిన కాకిలేటి గంగాభవానికి 51,728, బుర్రిలంక గ్రామానికి చెందిన వారాకుమారికి 50,933-, కాముల తాతారావుకు 66,358, వేమగిరి గ్రామానికి చెందిన షేక్ ఖాజా బాబుకు 70,000-, వార్డులకు చెందిన కందుల వీరబాబుకు 40,002, కొత్తపల్లి హరిత శ్రీకి 50,250/- మొత్తం కలిపి 14 మంది లబ్ధిదారులకు 12,65,349- రూపాయల ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల అందించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ "ఎన్టీఆర్ వైద్య సేవలో లేని అనేక చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి అప్పులబారిన పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆశాకిరణంగా మారింది. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.25 లక్షల వరకు వైద్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.గత 17 నెలల కాలంలో రూరల్ నియోజక వర్గం పరిధిలో రూ 2,69,42,532 సీఎం సహాయ నిధి కింద సహాయం అందచేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పందూరి అప్పారావు, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, కురుకూరి కిషోర్, బొప్పన నానాజీ, పెండ్యాల రామకృష్ణ, పితాని శివరామకృష్ణ, వట్టికూటి దత్తుడు, పాఠంశెట్టి రాంజీ, దండమూడి తేజ, తాడేపల్లి నాగరాజు, దొడ్డి బాబ్జి, చలమూరి సత్యనారాయణ, సింగవరపు సత్యనారాయణ, కొప్పిశెట్టి చిన్ని, గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## అడ్డతీగల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా జర్త. రమణారెడ్డి...



**అడ్డతీగల,పెన్ పవర్,నవంబర్ 13 :** గురువారం అడ్డతీగల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. జర్త. రమణారెడ్డి అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికయ్యారు. గత ఐదు సంవత్సరాలు పార్టీకి అండగా ఉంటూ కష్టనష్టాలు భరించిన రమణారెడ్డిని పార్టీ అధిష్టానం పార్టీ అధిష్టానం గుర్తించి రెండవసారి అవకాశం ఇచ్చినందుకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే మిరియాల. శిరీష దేవి భాస్కర్ కి రమణారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు పార్టీ అధ్యక్షులుతెలియజేశారు. పార్టీ అధిష్టానం తనపై పెట్టిన బాధ్యతను అహర్నిశలు కష్టపడి పార్టీకి విధేయుడనై ఉంటానని, పార్టీ అధ్యక్షులు రమణారెడ్డి తెలిపారు.

# కెప్టెన్సీ ఇస్తేనే రాజస్థాన్‌కు.. షరతు పెట్టిన రవీంద్ర జడేజా!

- ఐపీఎల్‌లో సంచలన ప్లేయర్ ట్రేడింగ్‌కు రంగం సిద్ధం
- చెన్నైకి సంజూ శాంసన్, రాజస్థాన్‌కు జడేజా, శామ్ కరన్
- రాజస్థాన్ కెప్టెన్సీ ఇస్తేనే డీల్‌కు ఒప్పుకుంటానన్న జడేజా
- ఇద్దరు స్టార్ ఆటగాళ్లను రూ.18 కోట్ల చొప్పున రిటైన్ చేసుకున్న ఫ్రాంచైజీలు
- 2008లో రాజస్థాన్‌తోనే ఐపీఎల్ అరంగేట్రం చేసిన జడేజా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ రిటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ, ఆటగాళ్ల ట్రేడింగ్‌పై ఊహాగానాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) మధ్య ఒక భారీ మార్పిడి ఒప్పందం జరగనుందనే వార్తలు క్రీడా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ డీల్‌లో భాగంగా రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్‌ను చెన్నైకి ఇచ్చి, అందుకు బదులుగా స్టార్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, శామ్ కరన్‌లను రాజస్థాన్ తీసుకోనున్నట్లు తెలుస్తోంది.వివిధ నివేదికల ప్రకారం ఈ ట్రేడింగ్ దాదాపు ఖరారైనట్లే. అయితే, రాజస్థాన్ రాయల్స్‌కు తిరిగి వెళ్లేందుకు జడేజా ఒక కీలకమైన షరతు పెట్టినట్లు సమాచారం. జట్టుకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తేనే ఈ ఒప్పందానికి అంగీకరిస్తానని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ డీల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన మరో రెండు, మూడు రోజుల్లో వెలువడే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు.సంజూ శాంసన్ దశాబ్ద కాలంగా రాజస్థాన్ రాయల్స్‌కు ముఖ్యమైన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఆ జట్టు తరఫున అత్యధిక పరుగులు (4027) చేసిన రికార్డు కూడా అతని పేరు మీదే ఉంది. అయితే, 2025 సీజన్ తర్వాత జట్టు మారాలని ఉందని సంజూ యాజమాన్యానికి తెలియజేయడంతో వారు ఇతర ఫ్రాంచైజీలతో ట్రేడింగ్ అవకాశాలను పరిశీలించడం ప్రారంభించారు. ఐపీఎల్ 2025 వేలానికి ముందు శాంసన్‌ను రాజస్థాన్ రూ. 18 కోట్లకు రిటైన్ చేసుకుంది.మరోవైపు రవీంద్ర జడేజా 2012 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌లో అంతర్భాగంగా ఉన్నాడు. సీఎస్‌కే గెలిచిన ఐదు టైటిళ్లలో మూడింటిలో అతను కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తర్వాత రెండో ప్రాధాన్య ఆటగాడిగా జడేజాను కూడా సీఎస్‌కే రూ. 18 కోట్లకు రిటైన్ చేసుకుంది. ఇప్పటివరకు 254 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన జడేజా, 143 వికెట్లతో సీఎస్‌కే తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 2022లో జడేజాకు సీఎస్‌కే కెప్టెన్సీ అప్పగించినా, జట్టు పేలవ ప్రదర్శన కారణంగా మధ్యలోనే అతన్ని తొలగించి ధోనీకి తిరిగి పగ్గాలు అప్పగించారు.ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, రవీంద్ర జడేజా తన ఐపీఎల్ కెరీర్‌ను 2008లో రాజస్థాన్ రాయల్స్‌తోనే ప్రారంభించాడు. ఆ ఏడాది రాజస్థాన్ టైటిల్ గెలిచిన జట్టులో జడేజా సభ్యుడిగా ఉన్నాడు. ఇప్పుడు మళ్లీ అదే జట్టుకు కెప్టెన్‌గా తిరిగి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# RCB నుంచి ఐదుగురు ఔట్.. స్టార్ పేసర్‌కు కూడా డిఫెండింగ్ ఛాంపియన్ గుడ్ బై..?





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆటగాళ్ల రిటెన్షన్ లిస్ట్ విడుదలకు బీసీసీఐ విధించిన డెడ్ లైన్ (నవంబర్ 15) సమీపిస్తుండటంతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ కసరత్తు ముమ్మురం చేసింది. వచ్చే సీజన్ కోసం ఏ ఆటగాడిని జట్టులో కొనసాగించాలి.. ఎవరిని వదిలేయాలనే దానిపై సీరియస్?గా ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఆర్సీబీ ఐదుగురు ఆటగాళ్లను విడుదల చేసే ఛాన్స్ ఉన్నట్లు క్రీడా వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అంచనాల మేర రాణించకపోవడం, ఇతర కారణాలతో ఈ ఐదుగురు ప్లేయర్లను వేలానికి వదిలేసేందుకు ఆర్సీబీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరీ ఆర్సీబీ విడుదల చేయనున్న ఆ ఐదుగురు ఆటగాళ్లేవరో తెలుసుకుందాం.

జట్టులో కీలక పేస్ బౌలరైన యష్ దయాల్?ను ఆర్సీబీ వదిలేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. వేలంలో దయాల్‌ను రూ.5 కోట్లకు ఆర్సీబీ కొనుగోలు చేసింది. యాజమాన్యం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని దయాల్ నిలబెట్టుకున్నాడు. తన ప్రదర్శనతో ఆర్సీబీకి కొన్ని మ్యాచుల్లో విజయాలు అందించాడు. యశ్ దయాల్ ప్రదర్శనపై సంతృప్తిగానే ఉన్న ఆర్సీబీ.. ఇటీవల అతడిపై కేసులు నమోదు కావడంతో గుడ్ బై చెప్పాలని సమాచారం.

**లియామ్ లివింగ్‌స్టోన్:**

ఇంగ్లాండ్ స్టార్ ఆల్ రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్?ను వేలంలో రూ. 8.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది ఆర్సీబీ. కానీ వెచ్చించిన ధరకు న్యాయం చేయడంలో లివింగ్‌స్టోన్ విఫలమయ్యాడు. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లో ఫెయిల్ కావడంతో లివింగ్ స్టోన్?ను వేలానికి ముందే విడుదల చేసే అవకాశం ఉంది.

**లుంగి ఎంగిడి:**

దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ లుంగీ ఎన్గిడి కూడా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నుంచి విడుదలయ్యే చాన్స్ ఉంది. గత వేలంలో కోటి రూపాయలకు ఎంగిడిని కొనుగోలు చేసింది ఆర్సీబీ. కానీ జట్టు కూర్పులో భాగంగా అతడికి ఎక్కువ మ్యాచులు ఆడే అవకాశం రాలేదు. గత సీజన్?లో ఎంగిడి కేవలం రెండు మ్యాచులు మాత్రమే ఆడి నాలుగు వికెట్లు పడగొట్టాడు.

**స్వప్నిల్ సింగ్:**

ఇండియన్ స్పిన్నర్ స్వప్నిల్ సింగ్?ను కూడా ఆర్సీబీ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. రూ.30 లక్షలకు సప్నిల్ సింగ్?ను ఆర్సీబీ కొనుగోలు చేయగా.. 2025 సీజన్ లో అతడికి ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. సీజన్ మొత్తం ఈ స్పిన్నర్ బెంచ్ కే పరిమితమయ్యాడు.

**రసిఖ్ దార్:**

యంగ్ ఇండియన్ ఫాస్ట్ బౌలర్ రసిఖ్ దార్ కూడా ఆర్సీబీ నుంచి విడుదల కావొచ్చు. గత సీజన్ లో ఆర్సీబీ తరుపున రెండు మ్యాచులు ఆడిన యంగ్ బౌలర్ ఆశించిన మేర రాణించలేదు. రెండు మ్యాచుల్లో కేవలం ఒక వికెట్ మాత్రమే తీసి నిరాశపర్చాడు. దీంతో వచ్చే సీజన్ కోసం ఆర్సీబీ అతడిని కొనసాగించకపోవచ్చు.

# బాలయ్య 'అఖండ-2'.. అక్కడే తొలి అడుగు..

టాలీవుడ్ నటసింహం నందమూరి బాలకృష్ణ.. అఖండ 2 తాండవం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమా.. డిసెంబర్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా రేంజ్ లో గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో భారీ అంచనాలు ఉన్నాయి. మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్, గ్లింప్స్ సూపర్ రెస్పాన్స్ అందుకున్నాయి. రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ తాండవం సాంగ్ ప్రోమో ఓ రేంజ్ లో అలరించింది. మ్యూజిక్ లవర్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. సాంగ్ పై పెద్ద ఎత్తున ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది.అయితే అఖండ మూవీలోని సాంగ్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో అందరినీ మంత్ర ముగ్ధులను చేసిన స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్.. ఇప్పుడు అఖండ 2తో మరోసారి అదరగొట్టేలా కనిపిస్తున్నారు. పవర్ ఫుల్, డివైన్ మోడ్ లో




అలరించనున్నట్లు తాండవం సాంగ్ ప్రోమో ద్వారా ఇప్పటికే అందరికీ క్లారిటీ వచ్చేసింది.తమన్ కంపోజ్ చేసిన ది తాండవం సాంగ్ ను దిగ్గజ గాయకులు శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ ఆలపించారు. ఏదేమైనా సాంగ్ కోసం ఇప్పుడు అంతా వెయిట్ చేస్తుండగా.. మరో రెండు రోజుల్లో పాట విడుదల అవ్వనుంది. ఈ నేపథ్యంలో తమన్ తాజాగా క్రేజీ అప్డేట్ ఇచ్చారు. స్పెషల్ మీడియా రిలీజ్ చేశారు. తాండవం సాంగ్ ఫైనల్ మిక్సింగ్ కంప్లీట్ అయిందని తెలిపిన తమన్.. పాట ఫుల్ పవర్ ఫుల్ గా ఉంటుందని అంచనాలు పెంచారు. అదిరిపోయే బీట్ తో అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. అదే సమయంలో తాండవం సాంగ్ ను ముంబైలో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. జుహులోని పీవీఆర్ మాల్ లో విడుదల చేయనున్నామని ప్రకటించారు.ఇద్దరు గొప్ప గాయకులు శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ కలిసి పాడిన తాండవం సాంగ్ ను వినేందుకు ఎంతో ఉత్సాహంగా ఉందని తమన్ వీడియోలో తెలిపారు. అయితే పాన్ ఇండియా రేంజ్ లో విడుదల అవ్వనున్న అఖండ ది తాండవం మూవీ ప్రమోషన్స్ తొలి అడుగు నార్త్ లో పడనుందన్నమాట. ఫస్ట్ సింగిల్ మంచి రెస్పాన్స్ అందుకుని మేకర్స్ లో జోష్ నింపుతుందనే అంచనాలు ఉన్నాయి. మరేం జరుగుతుందో వేచి చూడాలి.



**మోనాల్ గజ్జర్ యొక్క ఫ్యాషన్ స్టైల్‌లో మాస్టర్ క్లాస్**



**సోనమ్ బజ్వా తన గార్జియస్ స్టైల్‌తో తలలు పట్టుకుంది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965